మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 55 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada





# ముగిసిన నాలుగోదశ ఎన్నికల ప్రచారం



- పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు
- నిబంధన అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- శనివారం సాయంత్రం 6గంటలకు మూగబోయిన మైకులు
- తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలకు పోలింగ్
- చివరిరోజు ప్రచారంతో హోరెత్తించిన రాహుల్, ప్రియాంక, నడ్డా, అమిత్ షా

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): దేశవ్యాప్తంగా నాలుగోదశ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. తెలంగాణలో మైకులు మూగబోయాయి. చివరి రోజున ప్రచారాలతో హోరెత్తించారు. చివరి రోజు అమిత్ షా, నడ్డా, రాహుల గాంధీ,ప్రియాంకలు ప్రచారంతో మోరెత్తించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా మూడు దశల్లో 285 లోక్‌సభ సెగ్మెంట్లలో పోలింగ్ పూర్తయ్యింది. మే13 సోమవారం రోజున నాలుగో విడతలో 10 రాష్ట్రాల్లోని 96 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అలాగే ఏపిలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగనున్నాయి. మొత్తం 175 స్థానాలకు పోలింగ్ జరుగనుంది. జూన్ 1న సాయంత్రం 6 గంటల 30 నిమిషాల వరకు ఎగ్జిట్ పోల్స్ పై ఈసీ నిషేదం విధించింది. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో వైన్ షాపులు బంద్ అయ్యాయి. లోక్ సభ ఎన్నికల క్రమంలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి మద్యం దుకాణాలు బంద్ అయ్యాయి. పోలింగ్ జరిగే మే 13వ తేదీ సాయంత్రం వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయి. కల్లు కంపౌండ్‌లు కూడా ఓపెన్ కావు. పోలింగ్ ముగిసిన తర్వాత తిరిగి ఓపెన్ అవుతాయి. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఈసీ ఆదేశాలను ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ఇక తెలంగాణ నుంచి లోక్ సభ ఎన్నికల్లో మొత్తం 525 మంది పోటీ చేస్తున్నారు. అత్యధికంగా సికింద్రాబాద్ లో 45 మంది, ఆదిలాబాద్ లో అత్యల్పంగా 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక ఏపీ విషయానికి వస్తే .. 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది తలపడుతుంటే 175 అసెంబ్లీ స్థానాలకు 2387మంది పోటీలో నిలిచారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లోలోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం తెరపడింది. సార్వత్రిక ఎన్నికల నాలుగో దశలో భాగంగా తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు, ఏపీలో 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. అత్యంత సమస్యాత్మక మిగతా 2లో..

## కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

- ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడానికి విస్తృతమైన ఏర్పాట్లు
- తెలంగాణ డీజీపీ రవిగుప్తా వెల్లడి

హైదరాబాద్, (ప్రజా మంటలు): పార్లమెంట్ ఎన్నికల కోసం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని తెలంగాణ డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడానికి విస్తృతమైన బందోబస్తు ఏర్పాట్లను చేశామన్నారు. మిగతా 2లో..

## 144 సెక్షన్ అమలు

- 13న ఎన్నిక..జూన్ 4న కౌంటింగ్
- నలుగురు కన్నా ఎక్కువ మంది గుమిగూడొద్దు
- ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారానికి నో
- స్థానికేతరులు ఆయా ప్రాంతాలు విడిచి వెళ్లాలి
- పేపర్లలో ప్రకటనల కోసం ముందస్తు అనుమతి
- కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో 232 పోలింగ్ కేంద్రాలు
- ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్ అనుసంధానం
- ఇప్పటి వరకు రూ.320 కోట్ల నగదు సీజ్
- పోలింగ్ విధుల్లో లక్ష 90 వేల మంది సిబ్బంది
- 175 కంపెనీల కేంద్ర భద్రతా బలగాలతో నిఘా
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ వెల్లడి

హైదరాబాద్, (ప్రజా మంటలు): పార్లమెంట్ ఎన్నికల కోసం లోక్ సభ ఎన్నిక నేపథ్యంలో శనివారం మిగతా 2లో..



# ఒడిషాలో అధికారం మాదే

## - కాంగ్రెస్ సొంత ప్రజలనే భయపెట్టాలని చూస్తోంది

- ఒడిశాలోని జిల్లాల పేర్లు చెప్పగలరా? - సీఎం నవీన్ పట్నాయక్‌కు మోదీ సవాల్
- ఒడిశాలోని ఎన్నికల ప్రచారంలో ప్రధాని

భువనేశ్వర్ (ప్రజా మంటలు): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. పాకిస్థాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయని, దాన్ని మనం గౌరవించాలని ఆయన అన్నారు. దీన్ని భాజపా నేతలు తీవ్రంగా ఖండించారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందిస్తూ కాంగ్రెస్ పై విరుచుకుపడ్డారు. ఆ పార్టీ సొంత ప్రజలనే భయపెట్టాలని చూస్తోందని మండిపడ్డారు. ఒడిశాలోని కందమల్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యర్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "పాకిస్థాన్ వద్ద అణుబాంబు ఉందని ఆ పార్టీ (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) నేతలు అంటున్నారు. మరి ఆ దేశ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో తెలుసా? దాన్నుంచి ఎలా బయటపడాలో కూడా వారికి తెలియదు. వారి బాంబులను ఎవరైనా కొంటారేమోనని ఎదురు చూస్తున్నారు. కానీ వాటి నాణ్యత ప్రపంచమంతా తెలుసు కాబట్టి ఎవరూ కొనడానికి ఇష్టపడట్లేదు" అని దాయాదిని మిగతా 3లో..

# మోదీకి 75 ఏళ్లు నిండాయి

- తదుపరి ప్రధాని ఎవరు?:కేజ్రీవాల్
- ఆప్‌ను అణిచివేయాలని చూశారు
- అందుకోసం మోదీ ఏ ప్రయత్నాన్నీ వదల్లేదు
- ఆమ్‌ఆద్మీ ఒక పార్టీ కాదు... సిద్ధాంతం..
- స్పష్టం చేసిన ఢిల్లీ ముఖ్యమంత్రి



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మధ్యంతర బెయిల్ రావడంతో దిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి విడుదలైన సంగతి తెలిసిందే.ఈ క్రమంలోనే శనివారం ఆయన ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ఆమ్ ఆద్మీ కార్యాలయం వద్ద పార్టీ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన సీఎం.. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమ పార్టీని సమూలంగా అణచివేయాలని వారు కోరుకున్నారని దుయ్యబట్టారు. "మా పార్టీకి ఆ హనుమంతుడి ఆశీస్సులు ఉన్నాయి. అద్భుతం జరిగి నేను మళ్లీ మిగతా 3లో..


# గెలిచేది మేమే..

- నా రాజకీయ అనుభంతో చెబుతున్నా..
- కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోబోతోంది
- ఎక్కడా ప్రజాస్పందన లేకుండా సభల నిర్వహణ
- కాంగ్రెస్, బీజేపీల కన్నా మాకే ఎక్కువ సీట్లు
- రాష్ట్ర ప్రగతిని పక్కన పెట్టిన సీఎం రేవంత్
- చిల్లర రాజకీయాలతో అభాసుపాలు చేస్తున్నారు
- మీడియా సమావేశంలో కెసిఆర్ వెల్లడి

3లో..



# ప్రజా నాడి




# అసెంబ్లీలో మాదిరే పార్లమెంట్‌లోనూ పట్టంకట్టండి

- కాంగ్రెస్ గెలిస్తేనే పేదలకు మేలు
- వారి గురించి ఎల్లప్పుడూ ఆలోచించేది కాంగ్రెస్సే..
- భాజపా పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలుండవు
- ఆ పార్టీ బీజేపీది విభజించు, పాలించు విధానం
- రాజ్యాంగాన్ని తొలగించే ప్రయత్నాలు
- రిజర్వేషన్ల రద్దుకు కుట్రలు
- పేదల కోసం కంటితుడుపు చర్యలు
- కాంగ్రెస్ గెలిస్తేనే పేదలకు మేలు
- తాండూరు సభ, కామారెడి రోడ్‌షోలో ప్రియాంక
- పార్లమెంట్‌లో కాంగ్రెస్ బలం పెరగాలన్న సీఎం రేవంత్




తాండూరు,కామారెడ్డి (ప్రజా మంటలు): రాజ్యాంగాన్ని పూర్తిగా తొలగించాలని దేశంలో ప్రయత్నం జరుగుతోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ ఆరోపించారు. భాజపా పాలిత రాష్ట్రాల్లో పేదలను ఆదుకునే పథకాలేవీ ఉండవని చెప్పారు. రైతుల, నిరుపేదలు, మహిళల కోసం ఆ ప్రభుత్వం ఏమీ చేయదన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో గ్యాస్ సిలిండర్ రూ.1200 ఉందని, తెలంగాణలో రూ.500కే ఇస్తున్నామని గుర్తు చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో ప్రియాంక ప్రసంగించారు. రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. భాజపా పాలనలో పేదలపై వేసే పన్నులు నిరంతరం పెరుగుతూనే ఉంటాయి. పేద రైతులు రూ.50 వేలు, రూ.లక్ష రుణాలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారికి రుణమాఫీ చేసేందుకు భాజపా సర్కార్ అంగీకరించదు. కానీ, బడా వ్యాపారులకు మాత్రం భాజపా సర్కార్ రూ.16 లక్షల కోట్లు మాఫీ చేసింది. కీలకమైన సంస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకొని ఆడిస్తోంది. ప్రజలు ఎలా బతుకుతున్నారో తెలుసుకునే ప్రయత్నాన్ని మోదీ ఎప్పుడూ చేయరు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం వచ్చి ధర్మం అనే నినాదం ఎత్తుకుంటారు. ప్రజల మధ్య మతం చిచ్చు పెట్టి ఓట్లు వేయించుకుంటారు. కాంగ్రెస్‌పై భాజపా నేతలు మిగతా 2లో..

## రాజ్యాంగం, రిజర్వేషన్లను రద్దు చేయడమే బీజేపీ తొలి కర్తవ్యం

- ఆ పార్టీ వస్తే మళ్లీ నిరంకుశ విధానాలు
- మతకల్లోలాలతో హిందూ-ముస్లింలు చిచ్చుపెట్టాలని చూస్తున్నారు 2లో..
- పటాన్చెరు ప్రచారంలో సీఎం రేవంత్ విమర్శలు



## రాగల మూడు రోజుల్లో మోస్తరు వర్షాలు



హైదరాబాద్ (ప్రజా మంటలు): రాగల మూడు రోజుల్లో తెలంగాణలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిన్న ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కి.మీ.ఎత్తులో కొనసాగుతోంది. శనివారం కర్ణాటక, కేరళ మీదుగా మరత్వాడ నుంచి సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో ఈరోజు అక్కడక్కడ, ఆదివారం, సోమవారం మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈరోజు రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ., ఆదివారం రాత్రి 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

# తెలంగాణలో 10 ఎంపీ సీట్లు మావే..

- 11 చోట్ల విజయావకాశాలు ఉన్నాయి.
- ఐదేళ్లలో తెలంగాణకు లక్షల కోట్ల నిధులు
- మిగులు బడ్జెట్ రాష్ట్రం ఇప్పుడు అప్పులపాలు
- పదేళ్లలో స్వచ్ఛమైన పాలన ఇచ్చిన మోడీ
- ఒక్క అవినీతి మరకా లేని నిఖార్సయిన నేత
- బీజేపీకి కాంగ్రెస్ నేత రాహుల్ పోటీయే కాదు
- - కశ్మీర్ ఎప్పటికీ భారత్‌దే: అమిత్‌షా
- వికారాబాద్ ఎన్నికల ప్రచార సభలో, హైదరాబాద్ మీడియా సమావేశంలో అమిత్ షా

3లో..



మొదటి పేజీ తరువాయి

# కట్టుదిట్టమైన భద్రతా చర్యలు



ఎన్నికల్లో భద్రత నిమిత్తం 73 వేల 414 సివిల్ పోలీసులు, 500 తెలంగాణ స్పెషల్ పోలీస్ బలగాలు,164 కంపెనీల సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్, తమిళనాడుకు చెందిన మూడు స్పెషల్ ఆర్మ్ ఫోర్స్, 7000 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన హోంగార్డులు ఎన్నికల భద్రత విధుల్లో ఉంటారని చెప్పారు. అక్రమ మద్యం రవాణాను నిరోధించడానికి ప్రత్యేకంగా మొబైల్ టీమ్ లను ఏర్పాటు చేశామన్నారు డీజీపీ రవిగుప్తా. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక జరిపిన తనిఖీల్లో 184 కోట్ల విలువైన నగదు మద్యం డ్రగ్స్ పట్టుబడ్డాయన్నారు. ఎన్నికల పక్రియకు ఆటంకం కలిగిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల పర్యవేక్షణ కొరకు డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. చివరి ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌కు చేరేంతవరకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని అన్నారు.శనివారం డీజీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ రవిగుప్తా మీడియాతో మాట్లాడుతూ... మద్యం అక్రమ రవాణాను నిరోధించడానికి ప్రత్యేకంగా మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. మార్చి 16న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక జరిపిన తనిఖీల్లో రూ. 184 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్ పట్టుబడ్డాయన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా 34,526 మందిని బైండోవర్ చేశామని అన్నారు. పోలింగ్ పక్రియకు ఆటంకం కలిగిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల పర్యవేక్షణ కొరకు డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. చివరి ఈవీఎం స్టాం÷-రగ్ రూముకు చేరేంతవరకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని డీజీపీ రవిగుప్తా పేర్కొన్నారు.

# ముగిసిన నాలుగోదశ ఎన్నికల ప్రచారం

ప్రాంతాలైన అరకు, పాడేరు, రంపచోడవరంలో సాయంత్రం 4 గంటలకు, సమస్యాత్మక నియోజకవర్గాలైన పాలకొండ, కురుపాం, సాలూరులో 5 గంటలకు ప్రచారం నిలిపివేశారు. రాష్ట్రంలోని మిగతా 169 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాయంత్రం 6 గంటలకు ప్రచారం పరిసమాప్తమైంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత తెదేపా అధినేత చంద్రబాబు దాదాపు 90 ప్రజాగళం సభల్లో పాల్గొన్నారు. ఎన్డీయే కూటమి తరఫున ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.తెలంగాణలోని 106 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు, 13 సమస్యాత్మక సెగ్మెంట్లలో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఓటింగ్‌కు నిర్దేశించిన సమయం ప్రకారమే శనివారం సాయంత్రం ప్రచారానికి గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాస, భాజపాలు అన్ని స్థానాలకు పోటీ చేస్తున్నాయి. మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పరస్పర విమర్శలు, ఆరోపణలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించాయి. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, భారాస అధ్యక్షుడు కేసీఆర్ సహా అనేకమంది ముఖ్యనేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. రాష్ట్రంలోని 16 స్థానాల్లో మూడు ప్రధాన పార్టీలు తీవ్రంగా పోటీపడుతుండగా, హైదరాబాద్‌లో మాత్రం ఎంఐఎం కీలకంగా ఉంది. నామినేషన్ల పక్రియ ప్రారంభం కాకముందే మూడు పార్టీలు ప్రచారాన్ని ప్రారంభించాయి. బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లు, సమావేశాలు, రోడ్‌షోలకు అధిక ప్రాధాన్యం ఇచ్చాయి. కొన్ని ప్రాంతాల్లోనే అభ్యర్థులు ఇంటింటికీ తిరిగారు. ఎండల ప్రభావంతో ఉదయం, సాయంత్రం వేళల్లోనే నేతలు కనిపించారు. చివరి రెండు రోజులు వాతావరణం కొంత చల్లబడింది. ప్రచారంలో మాత్రం వాడీ వేడి పెరిగింది. చివరిరోజు సిఎం రేవంత్ రెడ్డి ప్రియాంకతో కలసి కామారెడ్డిలో ప్రచారం ముగించారు. కెసిఆర్ మీడియా సమావేశంతో తన ప్రచారం ముగించారు. కెటిఆర్, హరీష్ రావులు గతంలో కన్నా మిన్నగా ప్రచారంలో దూసుకుపోయారు. బిజెపి నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, అర్వింద్, ఈటెల రాజేందర్ కూడా జోరుగా ప్రచారం నిర్వహించారు.

# అసెంబ్లీలో మాదిరే పార్లమెంట్‌లోనూ పట్టంకట్టండి

ఎన్నో అబద్దాలు చెప్తున్నారు. కాంగ్రెస్ కొందరి ఆస్తులు గుంజుకొని మరో వర్గానికి ఇస్తుందని భాజపా దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి మోదీ దానిని రాయలేదు. మన పూర్వీకులు ఎంతో కృషి చేసి భావితరాల కోసం రూపొందించారు. రాజ్యాంగమే మనకు ఎన్నో అవకాశాలు కల్పించింది. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేది రాజ్యాంగం మాత్రమే. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని మరోసారి చాటి చెప్పాలి. ఈ రాష్ట్రానికి భాజపా ఏం చేసిందో అడగాలి. ఈ ప్రాంతం ఎంతో సుభిక్షమైనది. తెలంగాణ ప్రజలు ఎంతో కృషి చేసి ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకున్నారు. భాజపా అబద్దాలు నమ్మి.. మోసపోయేది లేదని చాటి చెప్పాలి' అని ప్రియాంక పిలుపునిచ్చారు. దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ది పొందాలని బిజెపి ప్రయత్నిస్తుందని ప్రియాంకగాంధీ అన్నారు. గడిచిన పదేళ్లలో మోదీ సర్కార్ బడా వ్యాపారుల కోసం మాత్రమే పనిచేసిందన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం మోదీ ప్రభుత్వం ఏనాడు పనిచేయలేదని విమర్శించారు. వాస్తవాలు తెలియకుండా మీడియాను మేనేజ్ చేస్తున్నారని ఫైరయ్యారు. గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని ప్రియాంకగాంధీ అన్నారు.బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయాలని చూస్తుందని.. బిజెపి కుట్రను అడ్డుకోవాలంటే కాంగ్రెస్ ను గెలిపించాలని ప్రియాంక గాంధీ చెప్పారు. హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రాజేసి రాజకీయాలు చేసి, బీజేపీ సీట్లు నెగ్గే ప్రయత్నం చేస్తుందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. పటాన్ చెరు ప్రాంతానికి గోదావరి జలాలు రావాలన్నా, మెట్రో రైలు రావాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. మాదిగల వర్గీకరణతో పాటు ముదిరాజులను బీసీ-డీ గ్రూప్ నుంచి బీసీ-ఏ గ్రూప్ లోకి మార్చాలన్నా కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ అగ్రనేతలు చెబుతున్నారని, రాజ్యాంగాన్ని సైతం మార్చే యోచనలో బీజేపీ ఉందని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, ఉపాధి అవకాశాలు పెరగాలంటే కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రానికి వచ్చినా కొత్త ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకపోగా, ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం మాత్రం చేశారని విమర్శించారు. ల్గ÷తులకు రుణమాఫీ చేసి వారి రుణం తీర్చుకుంటానని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం నిర్లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా వెనుకబడిందని, అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులు నెగ్గాలన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర సభలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీతో కలిసి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డిని చేపట్టింది కాంగ్రెస్ పార్టీ అని, కానీ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును బీఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఎన్నిసార్లు అడిగినా పాలమూరు ఎ÷-జాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ జాతీయ హోదా ఇవ్వలేదని ఆరోపించారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డికి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్ కు పంపించాలని ప్రజలను రేవంత్ రెడ్డి కోరారు. పార్లమెంట్ లో మన బలం పెరిగితే ప్రాజెక్టులకు జాతీయ హోదా, తెలంగాణ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. రైల్వే కోచ్, ఐటీఐఆర్ కారిడార్, బయ్యారం ఉక్కు కర్మాగారం అడిగినా కేంద్రం ఇవ్వలేదన్నారు. రైతు భరోసా కింద రూ.7500 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిధులు ఇవ్వలేదు, కాలేజీలు ఇవ్వలేదు, ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదని, కేంద్రం తెలంగాణకు కేవలం గాడిద గుడ్డు ఇచ్చిందంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి ఎ÷-జాజెక్టుకు జాతీయ హోదా అడిగినా కేంద్రం ఇవ్వలేదని సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. కేంద్రం నిర్లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. రంగారెడ్డి అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ గెలవాలని సీఎం అన్నారు. వికారాబాద్ జిల్లాకు కాంగ్రెస్ పార్టీ అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును బీఆర్ఎస్ పార్టీ పడావు పెట్టిందని విమర్శించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, రైల్వే కోచ్, ఐటీఐఆర్ కారిడార్ అడిగితే బీజేపీ ఇవ్వలేదని.. బీజేపీ ఇచ్చింది గాడిద గుడ్డు అని విమర్శించారు. రైతు రుణమాఫీ చేసి రైతుల రుణం తీర్చుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**కాంగ్రెస్ గెలిస్తేనే పేదలకు మేలు**

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాలని ప్రియాంక గాంధీ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ గెలిస్తేనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఉపాధి కూలీ రూ.400కు పెంచుతామన్నారు. ప్రతి మహిళా అకౌంట్లో రూ. లక్ష వేస్తామని హామీ ఇచ్చారు. కామారెడ్డిలో ప్రియాంకగాంధీ రోడ్ షో నిర్వహించారు. సిఎం రేవంత్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, షబ్బీర్ అలీలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియాంక గాంధీమాట్లాడుతూ ఈ దేశం అహింస, సత్యంపై అధారపడి ఉందన్నారు. . బీజేపీ అన్నదమ్ముల మధ్య చిచ్చుపెడుతుందని, దేశసంపదను బడా వ్యాపారులకు పంచుతుందని ఆరోపించారు. మోదీ పదేళ్ల కాలంలో ధనిక వర్గాలకు మాత్రమే మేలు జరిగిందన్న ప్రియాంక.. ఐదారుగురి ప్రయోజనాల కోసం మాత్రమే మోదీ పనిచేస్తున్నారని మండిపడ్డారు. రూ. 16 లక్షల కోట్లను మోదీ తన మిత్రులకు రుణమాఫీ చేశారు కానీ పేద రైతులకు మాత్రం రుణమాఫీ చేయ లేదన్నారు. ఈ ఎన్నికలతో మోదీ పని ఖతం అని జోస్యం చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో గ్యాస్ సిలిండర్ ధర రూ.1200 ఉంటే, తెలంగాణలో రూ.500కే ఇస్తున్నామని చెప్పారు ప్రియాంక. తెలంగాణ నుంచే మార్పు మొదలైందని తెలిపారు. బీజేపీ పాలనలో పేదలపై వేసే పన్నులు నిరంతరం పెరుగుతూనే ఉంటాయని తెలిపారు. దేశ ప్రజలు చెప్పే సమస్యలు వినడానికి కాంగ్రెస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని.. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని కాంగ్రెస్ నేతలు భావిస్తారని తెలిపారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని చెప్పారు.



# 144 సెక్షన్ అమలు



సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసింది. ఆ తరవాత తెలంగాణ రాష్ట్రంలో 144 సెక్షన్ అమలవుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. నలుగురు కన్నా ఎక్కువ మంది గుమిగూడొద్దని స్పష్టం చేశారు.ఎలక్ట్రానిక్ మీడియాలో ఆరు గంటల నుంచి ప్రచారం చేయొద్దని తేల్చి చెప్పారు. జూన్ 1వ తేది సాయంత్రం 6.30 నిమిషాల వరకు 144 సెక్షన్ ఉంటుందని వివరించారు. మే 13వ తేదీన కొన్ని సంస్థలు సెలవు ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఆ రోజు సెలవు ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కళ్యాణ మండపాలు, కమ్యూనిటీ హాల్, హోటళ్లలో ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తులు వెళ్లి పోవాలని వికాస్ రాజ్ సూచించారు. పేపర్లలో ప్రకటనల కోసం ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. 160 కేంద్ర కంపెనీల బలగాలు రాష్ట్రంలో ఇప్పటికే మోహరించాయని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి 20 వేల పోలీస్ బలగాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని వివరించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో 232 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వికాస్ రాజ్ స్పష్టం చేశారు. ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్ ఉంటుందని, వాటిని సీఈఓ ఆఫీస్ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుందని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. రూ.320 కోట్ల నగదు ఇప్పటి వరకు సీజ్ చేశామని వివరించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై 8600 కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. లక్ష 90 వేల మంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. వచ్చే 48 గంటల పాటు వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని వివరించారు. బల్క్ మెసేజ్‌లు సాయంత్రం 6 గంటల నుంచి ఆపాలని తేల్చి చెప్పారు. లక్ష 88 వేల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇప్పటి వరకు పోల్ అయ్యాయని తేల్చి చెప్పారు. 21 వేల 680 మంది ఓటర్లు హోం ఓటింగ్ వేసుకున్నారని వికాస్ రాజ్ తెలిపారు. 328 పోలింగ్ కేంద్రాలను ఏజెన్సీ ఏరియాల్లో ఏర్పాటు చేశామని వెల్లడించారు. మూడు పోలింగ్ కేంద్రంలో అత్యల్ప ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇక పోలింగ్‌కి ఒక్క రోజు మాత్రమే సమయం ఉంది. ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటి వరకు 400 కోట్లకు పైగా విలువగల డబ్బు, మద్యం, వస్తువులను సీజ్ చేసింది. ఎన్నికల నిఘా, భద్రత కోసం రాష్ట్ర పోలీసులతో పాటు, 175 కంపెనీల కేంద్ర భద్రతా బలగాలతో నిఘా పెట్టింది. ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు పాల్గొననున్నారు. ఈనెల 13న తెలంగాణలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో అన్ని ఏర్పాట్లు చేసింది ఎన్నికల కమిషన్. రాష్ట్రంలో మొత్తం 3.32 కోట్ల మంది ఓటర్లు ఉండగా. ఇందులో సగానికి పైగా మహిళా ఓటర్లే ఉన్నారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాలకుగాను 13 నియోజక వర్గాల్లో మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల 809 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్లలో ఎండలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని సూచించింది ఎన్నికల సంఘం. 9,900 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించిన ఎన్నికల సంఘం, అలాంటి ఏరియాల్లో ప్రత్యేక బలగాలతో నిఘా పెట్టేలా ప్లాన్ చేసింది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగనుంది. రాష్ట్రంలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలను నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ఎన్నికల సంఘం.. అలాంటి ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగాలని నిర్ణయించింది. రాష్ట్ర పోలీసులతో పాటు ఎన్నికల విధుల్లో భాగంగా కేంద్రం నుండి 175 కంపెనీలు విధుల్లో ఉండనున్నాయి. ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల్లో వ్యయ పరిశీలకులుగా 14 మందిని నియమించారు. జనరల్ పరిశీలకులుగా 17 మందిని నియమించారు. ఇక హోమ్ ఓటింగ్ కోసం 23,247 మంది ఓటర్లు దరఖాస్తు చేసుకోగా. ఇందులో 21,651 మంది ఓటు వేశారు. ఇక ఇవాళ్టి వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా లక్ష 80 వేలకు పైగా ఓటు హక్కు వినియోగించు కున్నారు. ఎన్నికలో టెక్నాలజీని కూడా ఈసారి బాగానే వినియోగిస్తున్నారు. సువిధ, సి విజిల్ యాప్?లతో పాటు 1950 కాల్ సెంటర్ అందుబాటులో ఉంచారు. నేటితో ప్రచారాకిని గడువు ముగుస్తుంది. మిగిలే ఒక్క రోజు చాలా కీలకం కావడంతో అధికారులను ఎన్నికల సంఘం మరింత అప్రమత్తం చేసింది.

# రాజ్యాంగం, రిజర్వేషన్లను రద్దు చేయడమే బీజేపీ తొలి కర్తవ్యం

- ఆ పార్టీ వస్తే మళ్లీ నిరంకుశ విధానాలు
- మతకల్లోలాలతో హిందూ-ముస్లింలు చిచ్చుపెట్టాలని చూస్తున్నారు
- పటాన్చెరు ప్రచారంలో సీఎం రేవంత్ విమర్శలు





హైదరాబాద్ (ప్రజా మంటలు): దేశం సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే లక్ష్యంతో భాజపా ఈ ఎన్నికల్లో ముందుకెళ్తోందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను రద్దు చేయాలని కుట్ర చేస్తున్నారన్నారు. రిజర్వేషన్ల రద్దు ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. లక్ష మెజారిటీతో మధును గెలిపించాలని కోరారు. బిజెపికి పిచ్చిపట్టిందని,హిందూ ముస్లింలు పొడుకుని రక్తం పారిస్తే తద్వారా ఆ పార్టీ సీట్లను గెలుచుకోచూస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెదక్ ప్రాంతంలో మౌలిక వసతులు సరిగా లేవని, ఈ ప్రాంతానికి గోదావరి నీళ్లు రావాలన్నా, మెట్రో రైలు రావాలన్నా, మాదిగల వర్గీకరణ జరగాలన్న, ముదిరాజ్ కులస్తులను బిసి-డి గ్రూప్ నుంచి బిసి-ఏ గ్రూపులోకి మారాలన్న కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును గెలిపించాలన్నారు. మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టాలని భాజపా యత్నిస్తోందని రేవంత్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలుంటేనే పెట్టుబడులు వస్తాయని, యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. భారాస హయాంలో పటాన్‌చెరు ప్రాంతంలో అభివృద్ధి జరగలేదన్నారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ ఫ్రంట్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను మార్చేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. పటాన్ చెరు ఒక మినీ ఇండియా అని అన్నారు. అన్ని కులాలు,మతాలకు అతీతంగా దేశానికే ఉత్పత్తిని అందిస్తోంది పారిశ్రామిక వాడ. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మిషన్ భగీరథ నీళు కూడా రాలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్ రామిరెడ్డి వేలాద మంది రైతులను మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్‌లో నిండా ముంచిన దుర్మార్గుడని మండిపడ్డారు. ఎమ్మెల్సీగా ఉంటూనే కేసీఆర్ మళ్లీ ఎంపీగా కొట్లాడటం విడ్డూరమన్నారు. వందల కోట్ల రూపాయలు కేసీఆర్‌కు, హరీశ్ కు ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ తెలంగాణకు ఇచ్చేందేమీ లేదన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ..ఇవేవీ తెలంగాణకు ఇవ్వలేదన్నారు. గాడిద గుడ్డు ఇచ్చిన బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. బీజేపీ హిందూ,ముస్లీం ఓట్లను చీల్చి రక్తంలో ఓట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయన్నారు. మెదక్ అభివృద్ధి జరగాలంటే పెట్టుబడులు రావాలన్నారు. నీలం మధును మెదక్ నుంచి లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. బడుగు బలహీన వర్గాల గొంతుకును పార్లమెంట్ కు పంపించాలని పిలుపు నిచ్చారు.

**ఎన్నికల్లో కాంగ్రెస్‌నే ఆశీర్వదించండి**

సార్వత్రిక సమరానికి మరి కొన్ని గంటలే మిగిలి ఉన్న వేళ.. సీఎం రేవంత్ రెడ్డి ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటానికి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని, ఇండియా కూటమిని గెలిపించాలని ప్రజలకు విన్నవించారు. 'ఇవి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి జరుగుతున్న ఎన్నికలు. అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని రాశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రిజర్వేషన్ల వల్లే పురోగమన దిశలో పయనించారు. రాజ్యాంగం మార్చాలని బీజేపీ కుట్ర చేస్తోంది. రిజర్వేషన్ల రహిత దేశంగా మార్చాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. ప్రపంచ దేశాలతో పోటీ పడాల్సిన భారత్ బీజేపీ కుట్రలకు బలి అవుతోంది. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఆశీర్వదించండి' అని రేవంత్ కోరారు.

# ఆర్థిక విజయాలు సాధిస్తే..ఎందుకీ దౌర్భాగ్యం

**ప్రజలను బజారున పడేసే విధానాలు ఎన్నాళ్లు**

**సామాన్యులు బతకులు దుర్లభం అవుతున్నా పట్టింపేది**

న్యూఢిల్లీ,మే11 (ప్రజా మంటలు): సంకల్పం ఎంత గొప్పదయినా కావచ్చు... కానీ ఆచరణలో దానిని చేసి చూపితేనే లక్ష్యం నెరవేరుతుంది. తొలిసారి పార్లమెంట్ గడప దొక్కినప్పుడు ప్రోగ్రెస్ రిపోర్ట్ అందిస్తానని ఆనాడు మోడీ ప్రకటించారు. పనుల ద్వారా తానేంటో చూపుతానని అన్నారు. సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కనిపించారు. కానీ ఈ నాలుగేళ్ల కాలంలో ప్రజలు గతంలో కన్నా హీనంగా బతుకీడు స్తున్నారు. వారి ఆశలు అడియాశలు అయ్యాయి. బతుకు భారంగా మారింది. అయినా వరుస విజయాలే లక్ష్యంగా పాలన సాగుతోంది తప్ప ప్రజలు మెచ్చే పాలన సాగడం లేదన్నది యాదార్థం. ఇది గమనించకుండా ప్రధాని మోడీ తన పాలనా తీరును కొనసాగిస్తున్నారు. తాను 140 కోట్ల మంది భారీతీయుల గొంతుక అంటున్న ప్రధాని ఇప్పటి వరకు నోట్ల రద్దు, జిఎస్టీ వంటి విషయాలపై స్పష్టత ఇవ్వడం లేదు. ప్రజల గొంతుక కాస్తా పారిశ్రామికవేత్తల గొంతుకగా మారింది. ఎదురువుతున్న సవాళ్లను పర్యవసానాలను ప్రధాని మోడీ ఎక్కడా తన ప్రచారంలో ప్రస్తావించడం లేదు. వాటి విపరీత ప్రభావాలను చర్చించడం లేదు. వాటి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలయినా పట్టించుకోవడం లేదు. ధరలు ఆకాశాన్నంటినా గమనించడం లేదు. ధాన్యం ఉత్పత్తులు పెరిగినా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. బ్యాంకులకు వెళ్లడం మహాపాపం అన్న విధంగా వ్యవస్థ తయారయినా దానిని పట్టించుకోవడం లేదు. ఇలా చెప్పు కుంటూ పోతే ప్రజలు కడుపునిండా తిని, నిద్రపోతున్నారన్న భావన లేకుండా పోయింది. సామాన్యులు సంపన్నులుగా మారకున్నా కూలీనాలీ చేసుకుని బతకగలగాలి. అలాంటి స్థితి



ఉండాలి. పేదమధ్య తరగతి ప్రజలు భరోసాగా మనగలగాలి. కానీ అలాంటి పరిస్థితులు ఈ పదేళ్లలో మాయమయ్యాయి. భారత ఆర్థికవ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచమంతా ఈ విషయాన్ని గుర్తించిందని ప్రచారం చేసుకోవడంతో సామాన్యులు కడుపు నిండదు. పేదరికం పోతే ఇంకా ఉచిత బియ్యం పంపిణీ ఎందుకు చేస్తున్నారో చెప్పరు. గోదాముల్లో మగ్గుతున్న ధాన్యం బయటకు రావడం లేదు. ఇవన్నీ వినడానికి లేదా విదేశాల్లో ఉన్నవారికి చెబితే బాగానే ఉంటాయి. కానీ అదే సందర్భంలో దేశప్రజల మనోగతం ఏమిటో ప్రధాని గుర్తించడం లేదు. చాయ్‌వాలా నుంచి ఎదిగిన మోడీ క్షేత్రస్థాయిలో సమస్యలు ఎలా ఉంటాయో తెలియని వ్యక్తి కాదు. క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఏంటో కొత్తగా తెలుసుకోవాల్సిన అవసరం లేదు. ఎంతసేపు విదేశీ పెట్టుబడులు, జిడిపి కాదు.. ప్రజల గొంతుక అంటే ప్రజలు ఏం చెబుతారో వినాలి. వినడం నేర్చుకుంటే పరిష్కారం చూపే ప్రయత్నం చేయవచ్చు. విపక్షాల విమర్శలను కూడా ప్రజల గొంతుకగా భావించాలి. అయితే విపక్షం విమర్శల కన్నా ఆరోపణలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తోందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో కేవలం అక్కడ విజయమే లక్ష్యంగా పావులు కదిపారు. ప్రజల సంకల్పాన్ని నెరవేర్చేందుకు తాను నిజాయతీతో కృషి చేస్తున్నానని ప్రధాని మోదీ చెప్పారు. అభివృద్ధే తన మంత్రమని, అందులో రాజీ లేదని పదేపదే పలు ప్రచార సభల్లో స్పష్టం చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితుల గురించి ఆరా తీయడం లేదు. ఎన్నికల ముందు కూడా ఇంకా అబద్దాలే ప్రచారంలో ముందున్నాయి. మన దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు బాగా పెరిగాయని, ఈ ప్రభుత్వానికి భిన్నమైన ఆలోచన ఉందని, దేశీయంగా భారత్ బాగా పనిచేస్తోందని అంతర్జాతీయ సమాజం గుర్తించిందని, ప్రపంచ దృష్టిని ఆకర్షించడం మంచి పరిణామని అంటున్నారు. సామాజిక, ఆర్థిక, సుపరి పాలనకు సంబంధించి ప్రభుత్వం సాహసోపేతమయిన విధాన చర్యలను తీసుకుంటోందని వెల్లడించారు. దేశంలో సులభతర వాణిజ్యం మెరుగయిందని, ప్రపంచానికి అదేంటో తెలుసని అన్నారు. ప్రపంచం నేరుగా భారత్‌తో మాట్లాడాలను కోవడం సహజమని, మన విధానాలు, సామర్థ్యం గురించి నేరుగా వినాలను కుంటోందని, నాయకుడి నుంచి వినడం ముఖ్యమని చెప్పారు. ఆర్థిక విజయాలంటే ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం. విద్య,వైద్య రంగాలు అభివృద్ధి చెందాలి. పర్యావరణం మెరుగు పడాలి. ఈ దిశగా అడుగులు వేయాలి. విదేశాలకు వెళ్లి మన గొప్పలు చెప్పుకున్నంత మాత్రాన ప్రజల జీవితాల్లో మార్పు రాదని గుర్తుంచుకోవాలి. మన ప్రజలు వెళ్లి విదేశాల్లో గొప్పగా చెప్పుకోగలగాలి. గొప్పగా బతుకుతు న్నారని చెప్పుకోవాలి. అప్పుడే భారత్ గొప్పతనం ప్రపంచం తెలుసుకుంటుంది. రాజకీయ అవినీతికి అడ్డుకట్టవేసి ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను చేస్తే ప్రజలు గర్విస్తారు. ఈ ఎన్నికల తరవాత అయినా పాలకులు ఎవరైనా ఈ తరహా ఆలోచన చేయాలి. పెరిగిన ధరలు కంట్రోల్ చేయాలి. ఉపాధిరంగాలను ప్రోత్సహించాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది.



# మోదీకి 75 ఏళ్లు నిండాయి

మీ మధ్యకు రాగలిగాను. ఆమ్ ఆద్మీ చాలా చిన్న పార్టీ. కేవలం రెండు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉంది. అలాంటి మమ్మల్ని అణచివేసేందుకు ప్రధాని మోదీ ఏ ప్రయత్నాన్నీ వదల్లేదు. నలుగురు నాయకుల్ని జైలుకు పంపించారు. ఒక పార్టీ నుంచి నలుగురు అగ్ర నేతలు జైలుకెళ్తే.. దాని మనుగడ కొనసాగగలదా? ఆప్‌ను మట్టికరిపించాలని ప్రధాని భావిస్తున్నారు. ఆప్ ఒక్కటే దేశానికి అద్భుతమైన భవిష్యత్తును అందించగలదని ఆయన కూడా నమ్ముతున్నారు. ఆమ్ ఆద్మీ ఒక పార్టీ కాదు. సిద్ధాంతం. మీరెంత అణగదొక్కితే మేం అంత పైకి లేస్తాం” అని కేజ్రీవాల్ అన్నారు. ఈ సందర్భంగా భాజపాపై కీలక ఆరోపణలు చేశారు. “విపక్ష ఇండియా కూటమికి నాయకుడు ఎవరు? అని భాజపా పదేపదే అడుగుతోంది. మరి వారి ప్రధాని అభ్యర్థి ఎవరు? వచ్చే సెప్టెంబరు 17 నాటికి మోదీకి 75 ఏళ్లు వస్తాయి. భాజపాలో ఆ వయసు వారు రిటైర్మెంట్ తీసుకోవాలని ప్రధానే రూల్ పెట్టారు. ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషీ, సుమిత్రా మహాజన్ లాంటి వారిని అలాగే పక్కనబెట్టారు. మరి మోదీ కూడా రిటైర్ అవుతారా? అలాగైతే ప్రధానిగా వారిలో ఎవరిని ఎన్నుకొంటారు?” అని సీఎం ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత రెండు నెలల్లో యూపీ సీఎం కూడా మారుతారని జోస్యం చెప్పారు. యోగి ఆదిత్యనాథ్‌ను పక్కనబెడతారని అన్నారు. అమిత్ షా కోసమే ప్రధాని ఇప్పుడు ఓట్లు అడుతున్నారని, మరి మోదీ గ్యారంటీని షా నెరవేరుస్తారా? అని దుయ్యబట్టారు. ”ప్రజాస్వామ్యాన్ని జైలులో పెడితే.. అక్కడి నుంచే ప్రజాస్వామ్య పాలన సాగుతుందని చెప్పేందుకు నేను రాజీనామా చేయలేదు. జైలు నుంచే నియంతపై పోరాటం చేశా. భాజపా నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా తాను దేశమంతా ప్రచారం చేస్తా” అని దిల్లీ సీఎం వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో భాజపా మరోసారి అధికారంలోకి వస్తే మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, ఉద్ధవ్ ఠాక్రే వంటి ప్రతిపక్ష నేతలంతా జైలుకు వెళ్తారని దిల్లీ సీఎం ఆరోపించారు. అవినీతిపై పోరాటం చేస్తున్నామని ప్రధాని చెబుతున్నారని, కానీ వారి పార్టీలోనే అవినీతి నేతలంతా ఉన్నారని దుయ్యబట్టారు. “అవినీతిపై పోరాటం ఎలా చేయాలో కేజ్రీవాల్‌ను చూసి నేర్చుకోండి. తప్పు చేస్తే సొంత పార్టీ నేతనే మేం జైలుకు పంపించాం” అని గుర్తుచేశారు. జూన్ 4 తర్వాత కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అందులో ఆప్ భాగస్వామిగా ఉంటుందన్నారు. అంతకుముందు తన సతీమణి సునీత, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌తో కలిసి హనుమంతుడి ఆలయాన్ని సీఎం దర్శించుకున్నారు. నేడు కేజ్రీవాల్ రోడ్ షో నిర్వహించనున్నారు. దిల్లీలోని మొత్తం ఏడు స్థానాలకు మే 25న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుంది.



# ఒడిషాలో అధికారం మాదే

మోదీ ఎద్దేవా చేశారు. అలాంటి దేశం పేరు చెప్పి సొంత ప్రజలనే భయపెట్టాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. అనంతరం కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. “తరచూ ఉగ్రదాడులు జరిగిన రోజులను ఈ దేశం ఎప్పటికీ మర్చిపోదు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు ప్రతిఘటించకుండా ఉగ్రవాదానికి పాల్పడిన వ్యక్తులతో కలిసి చర్చలు జరిపారు. ఓటు బ్యాంకును కోల్పోతామన్న భయంతోనే 26/11 దాడుల తర్వాత ఉగ్రవాదంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారి బలహీన ఆలోచనల వల్ల జమ్మూకశ్మీర్ కొన్ని దశాబ్దాల పాటు ఇబ్బందులకు గురైంది” అని ప్రధాని మండిపడ్డారు. సరిగ్గా 26 ఏళ్ల క్రితం ఇదే రోజు మాజీ ప్రధాని వాజ్‌పేయీ హయాంలో పోఖ్రాన్ పరీక్షను దేశం విజయవంతంగా నిర్వహించిందని గుర్తుచేశారు. నాటి ప్రయోగంతో భారత సామర్థ్యం ప్రపంచానికి అర్థమైందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా గెల్చుకోలేదని మోదీ అన్నారు. విజయం కాదు కదా.. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని విమర్శించారు.

**ఒడిశాలోని జిల్లాల పేర్లు చెప్పగలరా? సీఎం నవీన్ పట్నాయక్‌కు మోదీ సవాల్**కాగితాల మీద చూడకుండా ఒడిశా (రాటతిబష్ట్రజీ)లోని జిల్లాల పేర్లు చెప్పగలరా అని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సవాలు విసిరారు. ఒడిశాలోని కంధమాల్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని పాల్గొన్నారు. తాను చేస్తున్న ఈ ఛాలెంజ్.. నవీన్ పట్నాయక్‌కు ఓ ముఖ్యమంత్రిగా రాష్ట్రం గురించి ఎంత పరిజ్ఞానం ఉందో తెలుపుతుందని మోదీ అన్నారు. “మీ సీఎంను కాగితాల సాయం లేకుండా రాష్ట్రంలోని జిల్లాల పేర్లు, వాటి కేంద్రాల పేర్లు చెప్పమనండి. ఆయన పేర్లనే చెప్పలేకపోతే ఇక మీరు పడుతున్న బాధను ఎలా తెలుసుకుంటారు” అని మోదీ ప్రజలను ప్రశ్నించారు. పర్యాటక రంగంలో ఒడిశాకు ఉన్న అవకాశాల గురించి, ఆర్థిక రంగంలో దాని ప్రాముఖ్యత గురించి మోదీ వివరించారు. పోఖ్రాన్ అణు పరీక్ష వంటి చారిత్రాత్మక సంఘటనలను ఉటంకిస్తూ ప్రధాని భారత దేశ సార్థ్యాన్ని కొనియాడారు. భాజపా మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరుస్తానని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికలు ఒడిశా అభివృద్ధికి ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. ”ఒడిశా నాకు అపారమైన ప్రేమ, మద్దతును అందిస్తోంది. దేశానికి నిస్వార్థంగా సేవ చేస్తూ మీ నమ్మకాన్ని



నిలబెడతాను. 26 ఏళ్ల క్రితం, మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయీ ఇదే రోజున పోఖ్రాన్ అణు పరీక్షను నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులను ఈ పరీక్ష గర్వంగా తలెత్తుకునేలా చేసింది. భారత్ మొదటిసారిగా తన సామర్థ్యాలను ప్రపంచానికి తెలిపింది. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు పాకిస్థాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయని, ఆ దేశాన్ని మనం గౌరవించాలని చెబుతున్నారు. పాక్ పేరు చెప్పి సొంత ప్రజలనే భయపెట్టాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది” అని మోదీ విమర్శించారు.

# తెలంగాణలో 10 ఎంపీ సీట్లు మావే..

హైదరాబాద్ (ప్రజా మంటలు): మిగులు బడ్జెట్ రాష్ట్రం తెలంగాణ ఇప్పుడు అప్పులపాలయ్యిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విమర్శించారు. గతంలో భారాస అప్పులు చేసినట్లే కాంగ్రెస్ కూడా చేస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్లలో తెలంగాణకు రూ.లక్షల కోట్ల నిధులు ఇచ్చామని చెప్పారు. మరోసారి కేంద్రంలో భాజపా అధికారంలోకి రావడం ఖాయం. తెలంగాణలో 10 ఎంపీ సీట్లు తప్పక గెలుస్తున్నాం. 11 చోట్ల విజయావకాశాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 400 సీట్లు వస్తాయని మాకు పూర్తి విశ్వాసం ఉంది. మోదీ ప్రధానిగా ఉంటేనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. మోదీ పాలనలో ఉగ్రవాద దాడులు లేవు. తెలంగాణలో రామగుండం ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ నిర్మించాం. సమ్మక్క– సారక్క గిరిజన విశ్వవిద్యాలయం మంజూరు చేశాం. ఇలా ఎన్నో కీలక సంస్థలను నెలకొల్పాం. తెలంగాణ ప్రభుత్వ స్టీరింగ్ ఇప్పటికీ ఓవైసీ చేతిలోనే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలుకావడం లేదు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు. అదీ లేదు. రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి.. ఇవ్వలేదు. కౌలు రైతులకు రూ.15వేల ఆర్థిక సాయం లేదు. విద్యార్థులకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. భాజపా ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది. నా వీడియోను ఎడిట్ చేసి తప్పుడు ప్రచారం చేశారు. కాంగ్రెస్ వస్తే.. మళ్లీ ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తారని అమిత్ షా అన్నారు. తెలంగాణలో బీజేపీకి మంచి స్పందన ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో బిజెపి 10 సీట్లు గెలుస్తుందని చెప్పారు. మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్టీరింగ్ ఇంకా ఓవైసీ చేతిలోనే ఉందన్నారు. కాంగ్రెస్ కు తెలంగాణ ఏటిఎంలా మారిందని విమర్శించారు. దక్షిణాదిలో బీజేపీ అద్భుతంగా విజయం సాధించబోతుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. త్వరలో ప్రధాని నరేంద్ర మోడీకి 75 ఏళ్లు వస్తాయని, ఆయన స్థానంలో తర్వాతి ప్రధాని ఎవరంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ లేవనెత్తిన ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా తయారయింది. దీనికి కేంద్ర మంత్రి అమిత్ షా శనివారం స్పష్టీకరణ ఇచ్చారు. 'మోడీజీకి 75 ఏళ్లు వచ్చినా ఆయనను మార్చే ప్రసక్తే లేదు. దీనిని నేను స్పష్టం చేస్తున్నాను' అని అమిత్ షా స్పష్టం చేశారు.

**పదేళ్లలో స్వచ్ఛమైన పాలన ఇచ్చిన మోడీ**

ప్రధాని మోదీ అధికారం చేపట్టిన పదేళ్లలో ఆయనపై ఒక్క అవినీతి మరక, ఆరోపణలు లేవని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. కొంచం ఉష్ణోగ్రతలు ఎక్కువైనా విదేశాలకు వెళ్లే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తమకు పోటీనే కాదని షా అన్నారు. అమిత్ షా ఇప్పటికే మూడుసార్లు తెలంగాణకు వచ్చి బీజేపీ ప్రచారాన్ని ఉధృతం చేశారు. ప్రధాని మోదీ సైతం ఇప్పటికే పలుమార్లు రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేసి బీజేపీకి ఊపు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. బీజేపీ అగ్రనేతలు తరలివస్తుండటంతో ఆ పార్టీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో శనివారం వికారాబాద్‌లో పర్యటించారు. సర్జికల్ స్ట్రైక్స్ గురించి సీఎం రేవంత్‌రెడ్డి తమాషాగా మాట్లాడుతున్నారని అమిత్ షా విమర్శించారు. సర్జికల్ స్ట్రైక్స్ చేసే ధైర్యం కాంగ్రెస్‌కు లేదన్నారు. సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా పాక్‌లో ఉగ్రవాదులను ఏరిపారేసినట్లు తెలిపారు. భాజపా ఉన్నంతవరకు పీవోకే పాక్ వశం కాదని చెప్పారు. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనన్నారు. ఉగ్రవాదులను కాంగ్రెస్ పార్టీ కాపాడుతూ వచ్చిందని అమిత్‌షా ఆరోపించారు. దేశంలో ఉగ్రవాదాన్ని పారద్రోలడానికి మోదీ కృషి చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో రామ మందిరం నిర్మించారు. అయోధ్యలో రామ మందిరం అంశాన్ని 70 ఏళ్లుగా కాంగ్రెస్ నాన్చుతూ వచ్చింది. ఆలయ ప్రాణ ప్రతిష్ఠలో కూడా ఆ పార్టీ నేతలు పాల్గొనలేదు. తెలంగాణ అభివృద్ధికి హస్తం పార్టీ ఏనాడూ కృషి చేయలేదు. ఆ పార్టీతో పాటు మజ్లిస్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టే శక్తి కేవలం భాజపాకే ఉందని అమిత్‌షా అన్నారు. ముస్లిం రిజర్వేషన్లపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో 10 ఎంపీ సీట్లలో బీజేపీని గెలిపిస్తే.. ముస్లిం రిజర్వేషన్ ఎత్తేస్తామని ఆయన స్పష్టం చేశారు. తొలగించిన ముస్లిం రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీ ఓబీసీలకు ఇస్తామన్నారు. దళితుడిని రాష్ట్రపతి చేసిన ఘతన ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. ఎస్సీల పక్షాన మోదీ ఉన్నారని ప్రజలు నమ్ముతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలన్నారు. సర్జికల్ స్ట్రైక్స్ గురించి సీఎం రేవంత్‌రెడ్డి తమాషాగా మాట్లాడుతున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. సర్జికల్ స్ట్రైక్స్ చేసే ధైర్యం కాంగ్రెస్‌కు లేదన్నారు. వికారాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా పాక్‌లో ఉగ్రవాదులను ఏరిపారేసినట్లు తెలిపారు. భాజపా ఉన్నంతవరకు పీవోకే పాక్ వశం కాదని చెప్పారు. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనన్నారు. ఉగ్రవాదులను కాంగ్రెస్ పార్టీ కాపాడుతూ వచ్చిందని అమిత్‌షా ఆరోపించారు. ”దేశంలో ఉగ్రవాదాన్ని పారద్రోలడానికి మోదీ కృషి చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో రామ మందిరం నిర్మించారు. అయోధ్యలో రామ మందిరం అంశాన్ని 70 ఏళ్లుగా కాంగ్రెస్ నాన్చుతూ వచ్చింది. ఆలయ ప్రాణ ప్రతిష్ఠలో కూడా ఆ పార్టీ నేతలు పాల్గొనలేదు. తెలంగాణ అభివృద్ధికి హస్తం పార్టీ ఏనాడూ కృషి చేయలేదు. ఆ పార్టీతో పాటు మజ్లిస్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టే శక్తి కేవలం భాజపాకే ఉంది” అని అమిత్‌షా అన్నారు.

# గెలిచేది మేమే..



హైదరాబాద్ (ప్రజా మంటలు): తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించబోతోందని, ఆ పార్టీపై ప్రజల ఆగ్రహంతో ఉన్నారని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పాలనలో విఫలం అయ్యారని, చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రాష్ట్రం ఎలా ముందుకు వెళ్లాలో ఆలోచించడం లేదన్నారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పాలనపై మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్ తక్కువ దృష్టి పెట్టిందని,అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఏయే రంగాల్లో ఏం చేయబోతున్నారో చెప్పలేదు. అమూల్య సమయాన్ని చిల్లర రాజకీయాల కోసం వెచ్చిస్తున్నారు. అసెంబ్లీలో శ్వేత పత్రాలు విడుదల చేసి, ప్రతిపక్షంపై విమర్శలు చేశారు. రాష్ట్ర పురోగతి గురించి అసలు మాట్లాడలేదు. ఆ వైఫల్యమే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించబోతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. అది ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా కనిపిస్తుంది. రాజకీయ అనుభవం తోనే ఇది చెబుతున్నా. అధికారంలో ఉన్న పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ వస్తే, సరూర్‌నగర్ స్టేడియంలో అభాసుపాలయ్యారు. మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించిన జరిగిన సభకు కనీసం మూడు వేల మంది కూడా రాలేదు. సీఎం సభల్లోనూ ఖాళీ కుర్చీలు దర్శన మిచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న చొరవ ఇప్పుడు కనించలేదు. రాష్ట్రం దివాలా తీసిందనే వ్యాఖ్యలు ఏ ముఖ్యమంత్రి చేయడు. అది రాష్ట్రానికి దీర్ఘకాలికంగా ప్రయోజనాలు దెబ్బతీస్తుందని భారాస అధినేత కేసీఆర్ ధ్వజమెత్తారు. అందుకే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు కాటేయబోతున్నారని కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీని కాటేయడం ఖాయం.. అందులో ఎలాంటి అనుమానం లేదు.. ప్రజలు కూడా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 17 రోజుల బస్సు యాత్ర చేపట్టాను. ఆ తర్వాత జనం నుంచి వచ్చిన స్పందనలు, మధ్యాహ్నం సమయంలో జనం ఇచ్చిన సమాచారం ద్వారా తెలుస్తున్నది ఏందంటే ఈ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలను మించి ఎక్కువ స్థానాల్లో బీఆర్ఎస్ అద్భుతంగా గెలవబోతుంది. ఇందులో సందేహం లేదు. ఈ రెండు ప్రభుత్వాల ఆచరణ, అవలంబించిన తప్పుడు విధానాలు ప్రజల్లోకి వెళ్లాయి. వాటిని మేం చెప్పగలిగాం. దాని ఫలితమే బీఆర్ఎస్ అద్భుతమైన విజయం సాధించబోతుంది అని కేసీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అర్భక ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం చాలా తప్పులు చేసింది. ఎప్పుడు కానీ ఇంతకుముందు ఉన్న ప్రభుత్వం మారి వేరే ప్రభుత్వం కొలువు దీరినప్పుడు గత ప్రభుత్వం ఏ విధానాలో అవలంబించిందో అంతర్గ సమీక్షలు చేసి మెరుగైన పనితనం చూపించాలి. ఇది సహజంగా కనిపించేదే. భిన్నంగా అసహజమైన పద్ధతుల్లో ఒక పాలసీ లేకుండా, రైతులు, ఇండస్ట్రీ, పవర్, ఇరిగేషన్ సెక్టార్‌ను పక్కన పెట్టి అమూల్యమైన సమయాన్ని చిల్లర రాజకీయాల కోసం వేస్ట్ చేశారు. శాసనసభలో కూడా చిలిపి ప్రయత్నాలు చేశారని అన్నారు. ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారు. ఆ ఆగ్రహంతో పార్టీని ముంచేయడం ఖాయం అని కేసీఆర్ అన్నారు. స్వర్గీయ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మీద కోపంతో తమ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ, ఫీజు రియింబర్స్‌మెంట్ ఆపలేదు కదా..? ఆ రెండు పథకాలకు అదనపు నిధులు కేటాయించి ముందుకు తీసుకెళ్లామని కేసీఆర్ తెలిపారు. ఈ రెండు పథకాల వల్ల ఎంతో మందికి లబ్ధి చేకూరిందని కేసీఆర్ స్పష్టం చేశారు. పెట్టుబడులు ఆశించే దృష్ట్యా రాష్ట్రం బాగుందని చెప్పాలి. నేను సీఎం అయ్యాక తెలంగాణ ధనిక రాష్ట్రం అని చెప్పి నిరూపించాను. ధనిక రాష్ట్రమని చెబుతూ ఆ దిశగా పయనిస్తూ అద్భుత విజయం సాధించాను. శాసనసభలో శ్వేతపత్రాలతో తప్పుడు అంకెలు, లెక్కలతో కాలయాపన చేసి భంగపడ్డారు. ఈ ప్రభుత్వం ఏర్పడక ముందు అనేక వ్యవస్థలు చాలా చక్కగా పని చేశాయని కేసీఆర్ పేర్కొన్నారు. నేను సీఎం అయ్యాక హెల్త్ డిపార్ట్‌మెంట్ రివ్యూ చేశాం. ఆరోగ్య శ్రీ వివరాలు చెప్పారు. ఇది రాజవేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రారంభించింది. ప్రజలకు ఉపయోగం ఉందని చెప్పారు. దీన్ని ఇంప్రూవ్ చేయాలంటే ఎంత మనీ అవసరమో తీసుకుని పేరును కూడా మార్చొద్దు అని చెప్పాను. విద్యాశాఖ రివ్యూలో కూడా రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన ఫీజు రియింబర్స్‌మెంట్ గురించి చెప్పారు. మంచి కార్యక్రమం కానీ అవకతవకలు ఉన్నాయన్నారు. వాటిని సరిద్దిద్దాలని చెప్పాను. పథకాన్ని నిలపొద్దు.. అడిషనల్ మనీ తీసుకోవాలని చెప్పాను. ఏ ప్రభుత్వం పెట్టిన కార్యక్రమం కార్యక్రమమే. తెలంగాణ వ్యతిరేకి అయినప్పటికీ కూడా ఆ మహనీయుడు చచ్చి స్వర్గంలో ఉన్నప్పటికీ మంచి పథకం పెట్టిండు అని చెప్పి ఆరోగ్య శ్రీ కార్యక్రమాన్ని అమలు చేశాం. ఈ పథకంలో మరిన్ని రోగాలను యాడ్ చేశాం. మంచి పద్ధతుల్లో కొనసాగిస్తాం అని చెప్పాం. కానీ కాంగ్రెస్ లాగా చెరిపేస్తామని చెప్పలేదు. అది కంటిన్యూ చేశాం. ఫీజు రియింబర్స్‌మెంట్ చేశాం. కానీ ఈ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేయకుండా దెబ్బతీసుకుంది. బేషజాలకు పోయి వాళ్ల కాళ్లు వాళ్లే విరగొట్టుకున్నారు అని కేసీఆర్ పేర్కొన్నారు.

## కొంగ జపం

కొంగలు చెట్టుకొమ్మలపై నిలబడివుంది. చిట్టికొంగ ఒక కాలును మడిచి ఒంటి



కాలుమీద నిలబడింది .

అక్కడున్న కొంగలు ఒక్కసారిగా ఫక్కుమని నవ్వింది.

“ఏమిటి అందరూ నిన్ను చూసి నవ్వుతున్నారు” అడిగింది చిలుక

“చెరువులో చేయవలసిన కొంగ జపాన్ని చెట్టుమీద చేస్తుంటే మా కొంగలు నవ్వింది.”అంది చిట్టి కొంగ.

“చెట్టుమీద ఉన్నప్పుడు ఎందుకిలా ఒంటికాలుతో ... ఇదేమైనా చెరువా...చేపలు నీదగ్గరకు రావడానికి “అంది వేరొక కొంగ

“చెరువు ఇప్పుడు ఎండిపోయిందని నాకూ తెలుసు. కొంతకాలం తరువాత వర్షం వచ్చాక చెరువు నిండుతుంది. అప్పుడు చెరువులో చేపలు వస్తుంది. ఆ చెరువులో చేపలు పట్టడానికి ఒంటికాలుమీద నిలబడటానికి సులభముగా ఉంటుందని రోజూ కొంత సేపు ఇలా నిలబడటం అభ్యసిస్తున్నాను “అంది చిట్టి కొంగ

“ఎప్పుడో వచ్చే వర్షం తరువాత చెరువులో వచ్చే చేపలకు మనం ఇప్పటినుండే ఒంటికాలుమీద జపం చెయ్యాలా .చెరువు నిండి చేపలు వచ్చినప్పుడు చూసుకోవచ్చు. అయినా నీకు ఈ పిచ్చి ఆలోచన ఎలా వచ్చింది. “ అడిగింది ఒక కొంగ.

“అక్కడ గురుకుల పాఠశాలలో కొంతకాలం క్రితం విద్యాభ్యాసం పూర్తి చేసుకొన్న ఒక విద్యార్థి ఈ మధ్యనే మరలా వచ్చి చేరాడు.” అంది చిట్టి కొంగ

“ఎందుకూ” అడిగాయి కొన్ని కొంగలు .

“పాఠశాలలో వున్నప్పుడు ప్రతిరోజూ ఉదయాన్నే యోగాసనములు చేసేవాడట. విద్యముగించుకొని ఇంటికెళ్ళాక వ్యాపారస్థుడి దగ్గర పద్దులు వ్రాసే ఉద్యోగంలో చేరాడట , వుద్యోగం దొరికాక సోమరితనంతో యోగాసనములు చెయ్యడం మానుకొనడంవలన లావు కావడంతో పాటు బాన కడుపు వచ్చిందట .వాళ్ళ తల్లి తండ్రులు మరలా అక్కడ చేర్పించడం చూసాను.ఇంతకుముందు నేర్చుకొన్న ఆసనములే ఇప్పుడు చేయలేక ఆ విద్యార్థి అవస్థ పడటం గమనించాను .ఏ పని అయినా ప్రతిరోజూ అభ్యసించడం వలన అది సులభముగా కనపడుతుందని తెలుసుకున్నాను.” అంది

“ఎప్పుడో దొరికే చేపలకు ఇప్పుడే ఇలా కొంగ జపం అభ్యసించనక్కరలేదు. మానవులలాగా మనకేమి బాన కడుపులు రావులే...” హేళనగా అన్నాయి కొన్ని కొంగలు.

కొంతకాలం తరువాత వర్షం వచ్చి చెరువునిండి చేపలు వచ్చింది .కొంగలు చేపలను తమ దగ్గరకు రప్పించడం కోసం ఒంటికాలుతో నిలబడ బోతే ఎక్కువసేపు నిలబడలేక కదులుతూ కాలు పెట్టడంతో చేపలు దూరంగా వెళ్లిపోవడంతో ఆహరం దొరకక ఆకలితో బాధపడేవి

చిట్టి కొంగ ప్రతిరోజూ అభ్యసించినందువలన వృక్షాసనం భంగిమలో ఎంతసేపైనా సులభముగా నిలబడటంతో చేపలు దగ్గరకు రాగానే పట్టుకొని తినసాగింది.

“చిట్టి కొంగా, నీవు చెప్పింది నిజమే ,అక్కడ పాఠశాలలో బానకడుపుతో లావుగా వున్న అతను ప్రతిరోజూ యోగాసనం అభ్యసించడంవలన సన్నబడ్డాడు , సంతోషముతో ఇంటికి వెళ్లడం చూసాను .ఏదైనా ప్రతి రోజూ అభ్యసించడమే వలన చాలా సులభముగా వుండడం నిజమని తెలుసుకున్నాను “ .

ఆ తరువాత మరలా ఎండాకాలం వచ్చి చెరువులు ఎండిపోయింది. ఇప్పుడు చెట్టుమీదున్న కొంగలన్నీ కొంత సమయం ఒంటికాలుతో వృక్షాసనం భంగిమలో నిలబడటం అలవాటు చేసుకొనసాగాయి

– ఓట్ర ప్రకాష్ రావు
తిరుత్తణి, 09787446026




కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ ట్రయల్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

## ఓటర్లు చైతన్యం కావాలి

### ఓటేసేందుకు ముందుకు రావాలి

హైదరాబాద్,మే11 (ప్రజామంటలు): ఓటర్లలో చైతన్యం రావాలి. ఓటేసేందుకు ముందుకు రావాలి. మనం వేసే ఓటుతోనే ప్రభుత్వాలు ఏర్పడుతాయని గుర్తించాలి. ప్రతి ఎన్నికల్లోనూ నిరాశా నిస్పృహలు కానవస్తున్నాయి. ఓటర్లలో ఇంకా చైతన్యం రావడం లేదు. ముఖ్యంగా ఉద్యోగులు ఇళ్లు వీడడం లేదు. సెలవు ఇచ్చినా ఇంటికే పరిమితం అవుతున్నారు. ఓటు అన్నది ప్రభుత్వాల ఏర్పాటులో కీలకం అన్నది గుర్తించడం లేదు. ఎవరికి వారు తమకెందుకులే అన్న చందంగా ఉండడంతో ఓటింగ్ శాతం తగ్గిపోతోంది. నిజానికి ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఈ పరిస్థితి మారడం లేదు. ఓటు వేయకుంటే సంక్షేమ, అభివృద్ధి పథకాలను కట్ చేయాలి. అలాగే ప్రభుత్వ సేవలు అందకుండా చేయాలి. అప్పుడే ప్రజలు ఓటు కోసం వస్తారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి, పట్టణ ప్రాంతాలలో మంచినీటి సమస్య తదితర అంశాలపై అధికార బిజెపి పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రధానంగా గ్యాస్ సిలిండర్ ధరల పెరుగుదల ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపనుంది. పాత పెన్షన్ పథకం అమలు చేయకపోవడంతో బిజెపిపై ప్రభుత్వ ఉద్యోగులు పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు. ముస్లిం రిజర్వేషన్ల ఎత్తివేత వల్ల ముస్లింలు ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీకి దగ్గరవుతున్నారని, కర్నాటకలో ఇదే జరిగిందని కూడా భావిస్తున్నారు. నిజానికి బిజెపి పాలన దేశంలో ఏమంత గొప్పగా లేదు. డబుల్ ఇంజిన్ ఉన్న రాష్ట్రాల్లోనూ పెద్దగా గొప్పగా లేదు. ఈ క్రమంలో బిజెపికి ఓటేయాల్సిన అవసరం ఉందని ప్రజలు గుర్తిస్తారా అన్నది చూడాలి.

## ఇహసుఖాలపై ఆపేక్ష వీడాలి

విజయవాడ,మే11 (ప్రజామంటలు): పవిత్ర పుణ్యక్షేత్రం కాశీకి వెళితే...కాయో పండో వదిలేయాలి అని పెద్దలు అంటారు... అందులో మర్మమేమిటి...? అసలు శాస్త్రంలో ఎక్కడ కూడా.. కాశీకి వెళితే కాయో, పండో వదిలేయాలని చెప్పలేదు..శాస్త్రం చెప్పిన విషయాన్ని.. కొందరు తెలిసీ తెలియని విషయ పరిజ్ఞానంతో కొంచం వాళ్లకు అనుకూలంగా మార్చు కున్నారు. కాశీ క్షేత్రం విషయంలో శాస్త్రము చెప్తున్నది ఏమిటి అంటే... కాశీ వెళ్లి గంగలో స్నానం చేసి 'కాయా పేక్ష మరియు ఫలా పేక్ష' నుగంగలో వదిలి,ఆ విశ్వనాథ దర్శనం చేసుకొని ఎవరి ఇళ్ళకు వాళ్ళు తిరిగి వెళ్ళాలి అని. ఇక్కడ...కాయాపేక్షా, ఫలాపేక్షఅన్నారు... అంటే...ఈ కాయము పై అంటే శరీరము పై అపేక్ష అని.. ,ఫలాపేక్షా అంటే కర్మ ఫలముపై అపేక్ష అని మాత్రమే. పూర్తిగా వదులు కొని...కేవలం నిజమైన భక్తితో ఆ ఈశ్వర చింతన కలిగి ఉండమని పెద్దలు చెప్పారు. కాలక్రమేణా... అదికాస్తా కాయ, పండుగా మారి పోయింది. అంతే కానీ... కాశీ వెళ్లి ఇష్టమైన కాయగూరలు,తిండి పదార్థాలు గంగ లో వదిలేస్తే...మనకు వచ్చు భక్తి కానీ,అందులో నిజమైనపుణ్యం ఏం ఉంటుంది. కనుక...శాస్త్రం నిజంగా ఎలా చెప్తుందో అర్థం చేసుకొని... ఆ క్షేత్ర దర్శనము, ఆ సంప్రదాయం పాటిస్తే..నిజమైన ఆధ్యాత్మిక చైతన్యం వస్తుంది...అంతే కాని మామిడి పండుని, వంకాయని గంగలో వదిలేస్తే వచ్చే ఉపయోగం ఏమి ఉండదు. కనుక...ఈసారి మీరు కాశీ వెళితే...మనకి శత్రువులు అయిన ఈ శరీరం పై ఎక్కువ ప్రేమని, మనం చేసే కర్మల మీద లేనిపోని కర్మఫలం అపేక్షని మాత్రమే వదులుకొని...ఆ విశ్వనాథ దర్శనం చేసి, నిజమైన ఆధ్యాత్మిక జ్ఞానం కలగాలి అని ప్రార్థించాలని మాత్రమే ఇలా చెప్పారు.

## ఆడంబర ప్రచారాలతో బొక్కబోర్లా !

తొలుత నరేంద్ర మోడీ గుజరాత్ నమూనా అంటూ.. బాగా ప్రచారం చేసి అందరినీ నమ్మించారు. దూరం కొండలు నునుపు అన్న చందంగా అంతా నిజమూనని భ్రమించారు. ఈ ప్రచారంతో గుజరాత్ సిఎంగా ఉన్న నరేంద్ర మోడీ..దేశంలో అధికారంలోకి రాగలిగారు. ప్రధాని కాగలిగారు. వరుసగా రెండోసారి ప్రధాని అయ్యారు. ఇప్పుడు మూడోసారీ అదే ప్రయత్నంలో ఉన్నారు. అయితే గుజరాత్ నమూనా అంటే ఏమిటో ఇప్పుడు దేశప్రజలు రుచి చూస్తున్నారు. ప్రైవేటీకరణ, పరిశ్రమల మూసివేత, జిఎస్టీ వాతలు, నోట్లరద్దు, ఉద్యోగాల నియామకాల నిలిపివేత వంటి అనేకానేక చర్యలతో దేశ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ధరలు పెరుగుతున్నా పట్టించుకోక పోవడం, వ్యవసాయాన్ని బ్రహ్మాండం చేస్తామని చెప్పి, రైతులు రోడ్డెక్కినా పట్టించుకోక పోవడం, పార్లమెంటులో ఏ విషయమైనా చర్చించక పోవడం, ధరలను పెంచుతూ పోవడం అన్నీ గుజరాత్ నమూనాలుగా ఇప్పుడు ప్రజలు భావిస్తున్నారు. యూపిఎ ప్రభుత్వంలో ఇంత అధ్వాన్నంగా పరిస్థితులు లేవు. అయితే పదేళ్లలో మోడీ నిర్వాకం వల్ల బతుకులు దుర్భరంగా మారాయి. బియ్యం మొదలు, ఉప్పులు పప్పులు, గ్యాస్ పెట్రో ధరలు విపరీంగగా పెంచేశారు. ఔషధాల ధరలు అందుబాటులోకి రావడం లేదు. ఇవన్నీ కూడా గుజరాత్ మోడల్ కాబోలు అని ముక్కున వేసేసుకునేలా మన మోడీ చేసారు. అంతేనా అంటే భారతీయ జనతాపార్టీలో ఏకఛత్రాధిపత్యం సాగిస్తున్నారు. ఇప్పుడు పార్టీలో ఆయనను ఎదిరించే వారు కానీ...నిలదీసే వారు కానీ..ఇలా ఎందుకు చేస్తున్నారని అడిగేవారు కూడా లేకుండా పోయారు. ఇకపోతే బిజెపిలో సీనియర్లు అంతా ఇంటికే పరిమితం అయ్యారు. అద్వానీ, మురళీమనోహర్ జోషి లాంటి వారు వయసురీత్యా ఇంటికే పరిమితం అయ్యారు. అలాగే ఉన్న కొందరు సీనియర్లను పొగబెట్టి బయటకు పంపారు. కాశ్మీర్‌లో 370 రద్దు, సుప్రీంలో అయోధ్య అంశంలో విజయం, కాశీ కారిడార్‌లను చూపుతూ అదే పెద్ద విజయంగా..దేశ ప్రజలకు అన్నం పెట్టేదిగా చూపుతూ సోషల్ మీడియాలో రోజూ ప్రచారాలు చేసుకుంటున్నారు. మోడీని దైవాంశ సంభూతుడిగా కీర్తిస్తున్నారు. దేశంలో నేటికీ కరెంట్, మంచినీటి కొరత, సాగునీటి తిప్పలు, ధాన్యంసేకరణ, సాగు సమస్యలు అలాగే ఉన్నాయి. ఈక్రమంలో ఇంకా ప్రజలను ప్రచారంలో ముంచెత్తి పబ్బం గడుపుకునే ప్రయత్నాలే సాగుతున్నాయి. మోడీ పాలనలో గుజరాతీలైన ఆదానీ, అంబానీలు కోట్లకు పడగలెత్తారు. నిజానికి దేశంలో జరుగుతున్న అభివృద్ధిని, వివిధ రాష్ట్రాల్లో జరగుతున్న అభివృద్ధిని లెక్కల్లోకి తీసుకుంటే దేశంలో ఆర్థికంగా మనం ఎంత అట్టడుగున ఉన్నామో తెలుస్తుంది. తెలంగాణలో కూడా కెసిఆర్ కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారు. దీనిని తెలంగాణ మోడల్ అంటూ ప్రజలను నమ్మించి మోసం చేశారు. ఎపిలోనూ జగన్ బటన్ నొక్కుడుతో ఇదే అభివృద్ధి అని నమ్మిస్తున్నారు. విపక్షాలు చేస్తున్న అవినీతి ఆరోపణలు పక్కన పెట్టి తమది ఉత్తమమైన మోడల్ అంటూ అటు నరేంద్రమోడీ, ఇటు కెసిఆర్, జగన్‌లు ప్రచారంలో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నాలు చేశారు. గత ఎన్నికల్లో నిజాలు గుర్తించిన ప్రజలు తెలంగాణలో కెసిఆర్ పాలనకు చెక్ పెట్టారు. అభివృద్ధి నమూనాలో తెలంగాణ ఎంతో ఘనత సాధించిందని చెప్పడం అంతా డొల్ల అని తేలిపోయింది. అలాగే ఎపి కూడా డొల్ల అని తేలింది. గుజరాత్ కూడా డొల్ల అని తేలింది. వీరు గొపపగా చెప్పుకుంటున్న అభివృద్ధి నమూనా ఎంత మోసమో అన్నది కళ్లకు కనిపిస్తోంది. 24గంటల కరెంట్, సాగునీటి లభ్యత, చెరువుల పూడికతీత, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, కులవృత్తులకు ప్రోత్సాహం వంటివన్నీ ఊదరగొట్టి ప్రజలను భ్రమల్లో బతికేలా చేశారు. గుజరాత్‌లో అంతా మంచి జరిగితే ఇప్పుడు అక్కడ అభివృద్ధి కళ్లకు కనిపించాలి. .గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వం పట్ల పెచ్చరిల్లుతోన్న ప్రజావ్యతిరేకత ఎన్నికల్లో ప్రతిఫలించ కుండా తిమ్మినిబమ్మిని చేసే సకల విద్యలను మోడీద్వయం అనుసరిస్తోంది. అది ఎలా అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పడం అంత సులభం కాదు. గత ఎన్నికలకంటే ఈ సారి అత్యధిక సీట్లు సాధిస్తామని బిజెపి చెప్పుకుంటోంది. మొత్తంగా గుజరాత్ నమూనా తేలిపోయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా స్వంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా తమ ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత ఉందని ఈ ఇద్దరికి కూడా బాగా తెలుసు. నిజానికి గుజరాత్ మోడల్ బాగా సక్సెస్ అయివుంటే ఇలా జరిగేది కాదు. ఓట్లు చీలిపోవడం వల్ల తాము విజయం సాధిస్తామని బిజెపి అంచనాకు వచ్చేది కాదు. లేని అభివృద్ధిని భూతద్దంలో పెట్టి చూపించి ప్రజలను మభ్యపెట్టి విజయం సాధించడానికి బిజెపి గుజరాత్‌లో చేసిన ప్రయత్నాలు ఇప్పటి వరకు విజయం సాధించాయి. దేశంలోనూ అదే తరహాలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే ఇది ఎల్లకాలం పనిచేయదని కమలనాథులు గుర్తించడం లేదు. కాంగ్రెస్‌ను అణగదొక్కా మని, ఆప్‌ను కేసుల్లో ఇరికించామని, ఇక తమకు తిరుగులేదని భావిస్తున్నారు. మానవ అభివృద్ధి సూచికలు గుజరాత్ నమూనాలోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తున్నాయి. అందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షాలు తమ రాష్ట్రంలో ఎన్నికల ప్రచార సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ప్రజలు అనుకూలంగా ఉన్నప్పుడే మంచి పనులతో ఆకట్టుకోవాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తూ ముందుకు సాగితేనే బిజెపిని ఆదరిస్తారు. లేకుంటే గంగలో కలిపేస్తారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఇప్పుడు బిజెపి ఏ మేరకు విజయం సాధిస్తుందన్నది చూడాలి. అబద్దాలను అదేపనిగా ప్రచారం చేస్తే కెసిఆర్‌కు పట్టిన గతే అందరికీ పడుతుంది.

## కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి నారసింహుడు

### మే 13నుండి నరసింహ నవరాత్రి ఉత్సవాలు



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

“భూషణ వికాస శ్రీ ధర్మపుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర” అనే మకుటంతో భక్తాగ్రేసరుడు శేషప్ప (కాకుం శేషాచలదాసు) రచించిన నరసింహ శతకంలోని పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని తెలుగువా రుండరంటే అతిశయోక్తి కాదేమో... భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి, ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది... సుప్రసిద్ధ ప్రాచీన ధర్మపురి పుణ్యతీర్థం. కరీంనగర్ కు 71 కిలోమీటర్ల ఉత్తరాన, జగిత్యాలకు 27 కిలోమీ టర్ల ఈశాన్యాన తెలంగాణ లోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నదీ క్షేత్ర రాజం. ప్రధానంగా శివకేశవుల నిలయమై, శ్రీల క్ష్మీనరసింహ, రామలింగేశ్వర ఆలయాలు, మసీదు పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ ముస్లిం మత సామరస్యానికి ప్రతీకగా నిలచి ఉన్నదీ పుణ్యతీర్థం. బ్రహ్మాండ, స్కంధ పురాణాలలో, మడికె సింగన పద్మ పురాణంలో, చెరి కొండ ధర్మన్న చిత్ర భారతంలో, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో, ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో, నృసింహదాసు మైరావణ చరిత్రలో, పోతనామాత్యుని నారాయణ శత కంలో, పింగళి సూరనార్యుని కళాపూర్ణో దయంలో, శేషాచలదాసు – నరహరి, నృసింహ, నృకేసరి శతకాలలో, కాకతీయానంతర శాసనాలలో, మధ్యయుగ దానపత్రాలలో ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసించ బడింది. పూర్వం ధర్మవర్మ మహారాజు ధర్మదేవత భక్తుడై, ప్రజలను ధర్మ కార్యోన్ముఖులను చేయడానికి చేసిన తపస్సు ఫలితంగా “ధర్మపురి” నామాంకిత, నృసిం హుడు భక్తుల కోర్కెలు తీర్చేందుకై ఇచ్చట వెలసి యున్నాడని, పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. గౌతమ మహర్షి, తన బ్రహ్మహత్య పాతకాన్ని పోగొట్టుకునేందుకు పరమశివుని గూర్చి తపస్సు చేసి, ఆయన జటాజూటం నందు గల “గంగా దేవి”ని ధర్మపురికి రప్పించినందున “గౌతమి, గోదావరి” అని నదీ పేర్లు వచ్చినట్లు స్థల పురాణం విశద పరుస్తున్నది. శ్రీరామచంద్ర స్థాపిత రామేశ్వరాలయం, అక్కపెల్లి రాజేశ్వరాలయం, శ్రీరామాలయం, దత్తాత్రేయ, గౌతమేశ్వర, శ్రీసాయి శివ బాలాజీ , అయ్యప్ప, ప్రసన్నాంజనేయ, భక్తాంజనేయ, యమ ధర్మ రాజ, సంతోషిమాత, సత్యవతీ, మహాలక్ష్మి మంది రాలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. రామాయణ, భారత, భాగ వతాది పురాణ ఘట్టాలు చెక్క బడిన నృసింహాల యపు కాక తీయుల శిల్పకళకు అద్దం పట్టే కళ్యాణ మంటపం, శివా లయంలోని గణేష, చండిక, సప్తమాతృకలు, నల్లశెనపు రాతిపై సమంశ పద్ధతిలో చెక్కబడిన శ్రీరామలక్ష్మణ, సీతాదేవిల విగ్రహాలు మిగుల మనోజ్ఞమై ఉన్నాయి. ధర్మపురి క్షేత్రం మొదట జైన, బౌద్ధ యుగములందు ఆర్ష విద్య ప్రచార కేంద్రమై విదర్భ రాజ్య పోషణలో మున్యాశ్రమంగా ఉండేది. తర్వాత శాతవాహన, బాదామి చాళుక్య, రాష్ట్రకూట, కళ్యాణి చాళుక్య, కాకతీయ, రేచర్ల వెలమల మరియు నైజాం రాజుల ఏలుబడిలో అద్వితీయ వైభవాన్ని అనుభవించింది. ప్రతాప రుద్రుని కాలంలో ఢిల్లీని ఏలిన అల్లావుద్దిన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాఫూర్ సైన్యం క్రీస్తు శకం 1309లో ఇందూరు (నిజామాబాద్) మీదుగా కాకతీయులపై దండెత్తిన సమయంలో ఇచ్చటి నృసింహాలయం, రామేశ్వరా లయాలను ధ్వంసం చేసినట్లు చరిత్ర చెబుతున్నది. 14వ శతాబ్ది మూడవ పాదంలో నారాయణాశ్రమ స్వామి అనే సన్యాసి, నాటి రామగిరి పాలకుడైన ముప్ప భూపతి సేనాని కేశనమంత్రి సాయంతో నారాయణ పురమను మఠంను స్థాపించి, బ్రాహ్మణులకు గృహములను నిర్మింపజేసి, అన్నసత్రాన్ని నెలకొల్పారు. 1724-50 మధ్య ధర్మపురివాసులు తిరిగి నృసింహాలయాన్ని నిర్మించారు.



#### క్షేత్ర ప్రాశస్త్యం

ఆద్వితీయ మహిమాన్వియైన ధర్మపురి క్షేత్ర మున యాత్రికుల సౌకర్యార్థం నివాస స్థానములను కట్టించువారు భగవత్కటాక్షమున ఉత్తమ భవనముల పొందగలరని, ఇచ్చటి జీర్ణ మందిరములను ఉద్ధరించువారు వైకుంఠమునందు ఉత్తమ సుఖములను అను భవించగలరని, శ్రీనృసింహుని పూజ కొరకు పూల చెట్లను పెంచువారు నందనాది వనములతో సౌఖ్యములను అను భవించ గలరని, శ్రీనృసింహు శౌల్యన్నమును, దధ్యన్నమును మరియు పులిహోరను నైవేద్యమిడు వారు అన్నదాతలై భగవత్కటాక్షమునకు పాత్రు లగుదురని, నృసింహుని ప్రీతికై క్షేత్రమున బ్రహ్మణులకు భూదానం, గోదానం మరియు హిరణ్యాది దానములనొసంగువారు ముందు జన్మమున సార్వభౌములగుదురని, క్షేత్రమున దీనాందులకు, దంపతులకు, బ్రహ్మచారులకు, పశుపక్ష్యాదులకు అన్నదాన మొనర్చినచో, నృసింహ కటాక్షమున వారి వారి పితృదేవతలు మోక్షమును పొందగలరని, శౌనకాది మహర్షు లకు నైమిషారణ్యము నందు శూత పౌరాణికులు వివరించినట్లు స్కంధ పురాణాంతర్గత ధర్మపురి క్షేత్ర మహత్యం విశదపరుస్తున్నది.

#### నరసింహ అవతార ప్రత్యేకత

రామకృష్ణాది అవతారములవలె గాక, నిర్యాణములేని శాశ్వత అవతారమైన శ్రీనరసింహుని జయంతి, హిందూ పండగలలో అత్యంత ఆధ్యాత్మిక ప్రాధాన్యత నొందింది. వైశాఖ శుద్ధ చతుర్దశి పుణ్య తిథియందు ఉద్భవించిన నారసింహుని పూజలతో, ఆకాల మృత్యు భయముండదని, దుష్టగ్రహ బాధలు, పైశాచిక చేతబడుల ప్రయోగాలను తిప్పికొట్టే శక్తి నారసింహ మంత్రానికి గలదని భక్తుల, సాంప్రదాయా చరణాసక్తుల ప్రగాఢ విశ్వాసం. “ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతో ముఖం, నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం” మంత్రంతో నరసింహ స్వామిని పూజిస్తే శత్రు జయం కలుగుతుంది. పగలు రాత్రి కాని సంధ్యా. సమయాన, నరుడు జంతువు కాని రూపంతో, భూమ్యాకాశాలు కాని తొడలపై, సజీవము నిర్జీవ మూకాని చేతిగోళ్ళతో, హిరణ్యకశిపుని చీల్చి భక్త జన రక్షకుడై, సుదర్శన, శంఖ, చక్ర, ఖడ్గ, అంకుశ, పాశు, పరశు, ముసల, కులిశ, పద్మాదులను కలిగి గదాధరుడై ప్రకాశించిన ఉగ్రనారసింహ అవతార తత్వం మిగతా అవతారాలకు భిన్నం.

#### నరసింహ నవరాత్రులు

కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి లక్ష్మీ సమేత నారసింహ (యోగ, ఉగ్ర) నవరాత్రి ఉత్సవాలు మే 13వ తేదీ నుండి 21వ తేదీ వరకు సాంప్ర దాయ రీతిలో జరుగనున్నాయి. సర్వ దేవతా మూర్తులను కలిగి ‘ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు’ అని విఖ్యాతి నందిన ప్రాచీన చరిత్ర మరియు పౌరాణిక ప్రాధాన్యత కలిగిన ధర్మపురి క్షేత్రంలో ఏటా వైశాఖ శుక్ల షష్టి నుండి చతుర్దశి వరకు స్థానిక దైవాల నవరాత్రి ఉత్సవాలు సాంప్రదాయ రీతిలో నిర్వహించడం అనాదిగా ఆచరణలో ఉంది. ఈ సంవత్సరం ప్రధానంగా మే 17 న సహస్ర కలశాభిషేకం, 18న చందనోత్సవం, 19న వసంతోత్సవం, పల్లవోత్సవం, అన్న కూటోత్సవం, నిత్య ఆరాధనలతో పాటు 20న లక్ష తులసీ పూజ, సాంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించ నున్నారు. 21న నర సింహ జయంతి, ప్రత్యేక స్థంభోద్భవ పూజాది కాలు నిర్వహించ నున్నారు. దేవస్థానం ఏసి, ఈఓ సంకటాల శ్రీనివాస్, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, ముత్యాల శర్మ, వివిధ ఆలయాల అర్చకులు, సిబ్బంది కార్యక్ర మాల ఏర్పాట్లు, నిర్వహణలలో నిమగ్నమై ఉన్నారు.

## బిజెపి జాతీయ అధ్యక్షులు నడ్డాకు ఆంజనేయస్వామి చిత్రపటం బహూకరణ

ఆదోని మే 11 (ప్రజామంటలు):



ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ఆదోనిలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభకి విచ్చేసిన బిజెపి జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా ఆదోనికి విచ్చేసిన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించి ప్రసాద్ దాన్ని అందజేసిన గుంతకల్ బిజెపి రాష్ట్ర నాయకులు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకాల రెడ్డి , బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదోని ఇన్చార్జి యం. మహేశ్వర్ , బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వనగంది విజయలక్ష్మి, బిజెపి కిషన్ వచ్చా రాష్ట్ర సభ్యులు గుర్రం సూర్యనారాయణ బిజెపి క్రియాశీలక సభ్యులు వనగుంది కిరణ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించండి

**- కాంగ్రెస్ ను గెలిపించకుంటే కష్టాలు కొని తెచ్చుకున్నట్ల**

**- తెజస జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి**

జగిత్యాల మే 11 (ప్రజామంటలు):



ప్రస్తుతం జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే అధిక మెజారిటీ తో గెలిపించాలని తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి ఓటర్లకు పిలుపు నిచ్చారు. శనివారం ఆయన జగిత్యాలలో విలేఖరులతో మాట్లాడారు. ఉద్యమాల రథ సారథి ప్రొఫెసర్ కోదండరాం స్థాపించిన తెలంగాణ జన సమితి కాంగ్రెస్ పార్టీ కి సంపూర్ణ మద్దతు ప్రకటించడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రో.కోదండరాం సారథ్యంలో కృషి చేయడం జరిగిందన్నారు. ప్రజలు కోరుకున్న ప్రకారం తెలంగాణలో ప్రభుత్వ మార్పు సాధించామని, నేడు దేశంలో కూడా పాలన, పాలకుల మార్పును దేశ ప్రజలు కోరుకుంటున్నారని ఆయన సూచించారు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన సీనియర్ నాయకులు టి.జీవన్ రెడ్డి, పెద్దపల్లి అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ లతో పాటు రాష్ట్రంలోని మిగతా పార్లమెంటు స్థానాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే భారీ మెజారిటీ తో గెలిపించాలని ఆయన ఓటర్ మహాశయులకు విజ్ఞప్తి చేశారు. గత పదేండ్ల నరేంద్ర మోడీ పాలనలో నిత్యావసర సరుకులను కూడా వదిలి పెట్టకుండా దాదాపు ప్రతి దానిపై జీఎస్టీ పేరుతో దేశ ప్రజలను దోచుకోవడం జరుగుతుందన్నారు. దేశ సంపదను సంపన్నుల పాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ ను కూడా నిర్వీర్యం చేస్తూ, బహుళజాతి ప్రైవేట్ కంపెనీలకు టెలికం వ్యవస్థను తాకట్టు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని, విద్య - వైద్యం లను కూడా ప్రైవేట్ కార్పొరేట్ ల పాలు చేశారని ఆరోపించారు. బ్యాంకుల్లో లక్షలాది కోట్ల రూపాయలు అప్పు తీసుకుని విదేశాలకు పారి పోయిన సంపన్నులకు అప్పులు మాఫీ చేసిన నరేంద్ర మోడీ దేశంలోని పేద ప్రజలకు ఒరగ బెట్టింది ఏమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గానీ, దేశంలో గానీ అనేక కుంభ కోణాలు, అవినీతి అక్రమాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రజలు కండ్లు తెరచి దేశంలోని నరేంద్ర మోడీ పాలనను మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే భారీ మెజారిటీ తో గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించక పోతే మనకు మనమే కష్టాలు కొని తెచ్చుకున్న వాళ్ళం అవుతామని చుక్క గంగారెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీగా టి. జీవన్ రెడ్డి, పెద్దపల్లి ఎంపి గా గడ్డం వంశీకృష్ణ లను ఆయా పార్లమెంటు పరిధి ఓటర్లు అధిక మెజార్టీ తో గెలిపిస్తున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఈటెలకు వీరశైవ లింగాయత్‌ల మద్దతు

**హైదరాబాద్,మే11:** మల్కాజిగిరి నియోజకవర్గంలో వీరశైవలింగాయత్‌లు తమ మద్దతును బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ప్రకటించారు. ఈ మేరకు వీరశైవలింగాయత్ సమాజం అధ్యక్షుడు ఆలూరే ఈశ్వర ప్రసాద్ మల్కాజిగిరిలోని తన నివాసంలో వీరశైవలింగాయత్‌లతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుభవజ్ఞులు, ప్రజల మనిషి, సమస్యల పరిష్కారంలో అనుభవం కలిగిన ఈటల రాజేందర్‌కు తమ సమాజం పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు.



నియోజకవర్గంలో సుమారుగా మూడు వేల కుటుంబాలు ఉంటాయని, ఈ మూడువేల కుటుంబాలు సైతం బీజేపీకి పూర్తి మద్దతుగా తెలుపుతామని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానిగా కాబోతున్నారని, కేంద్రంలో బీజేపీ ప్రధానిగా మోదీ సర్కార్ ఉంటేనే దేశపురోభివృద్ధిని సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు లింగాయత్‌లు పాల్గొన్నారు.

## పోలీసులు వెంబడిస్తున్నారన్న భయం

**లేపాక్షిలో నోట్ల కట్టలు వదిలేసిన దుండగులు**

**ఈ ఘటనపై అధికారకి సమచారం కోసం విచారణ**

**హిందూపురం,మే11** శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నడిరోడ్డుపైనే పడేశారు. తమను పోలీసులు వెంబడిస్తున్నారనే భయంతో రహదారిపైనే దాదాపు రూ.2 కోట్ల డబ్బును వదిలేసి వెళ్లినట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా పోలీస్ సైరన్ వినిపించడంతో ఇళ్ల ముందు డబ్బు సంచులు పడేసి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ నగదు హిందూపురానికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతసేపటి తర్వాత వచ్చి చూడగా దాదాపు రూ.40 లక్షలు మాయమైనట్లు గుర్తించారు. అయితే, అక్కడి వారిని విచారించి లాభం లేక మిగిలిన డబ్బులతో వారు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారిక సమాచారం లేదు. ఎన్నికల వేళ కొన్ని చోట్ల కొందరు కొత్త పద్ధతుల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. కేవలం నగదు పంపిణీయే కాకుండా.. ఎవరికీ అనుమానం రాకుండా వారికి టోకెన్లు ఇచ్చి తాయిలాలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఒంగోలు నియోజకవర్గంలో ఓటర్లకు రూ.10, మహిళలకు రూ.50 నోట్లు టోకెన్లుగా ఇస్తున్నట్లు సమాచారం. షాపులకు వెళ్లి వీటిని చూపిస్తే రూ.10కు క్వార్టర్ మద్యం బాటిల్, రూ.50కు బియ్య బస్తాలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ సమాచారం అందుకున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టగా.. ఓ గోదాంలో 3 లారీల బియ్య బస్తాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే, ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసిన పోలీసులు, ఎన్నికల అధికారులు సమన్వయంతో సోదాలు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్లు భారీగా అక్రమ నగదు స్వాధీనం చేసుకున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ముగిసిన ప్రచార పర్వం. మిగిలింది పోలింగ్ కార్యక్రమం

ధర్మపురి మే 11 (ప్రజామంటలు):





లోకసభకు మే 13న జరుగనున్న ఎన్నికల సందర్భంగా శని వారం సాయంత్రం ప్రచార పర్వానికి తెర పడింది. ధర్మపురి, రామగుండం, పెద్ద పెల్లి, మంథని, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల శాసన సభ నియోజక వర్గాలతో పెద్ద పెల్లి నామాంకితయై ఎస్సీ రిజర్వుడు లోకసభ నియోజకవర్గంలో అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు ధీమాతో ప్రచార కార్యక్రమాలను ఉధృతం చేస్తూ, ముందుకు సాగగా, ప్రచారపర్వం ముగిసిన సందర్భంగా, ఇక ఓట్లను కూడ గట్టుకునేందుకు చేయాల్సిన కార్యక్రమాలపై దృష్టి నిలిపారు. ప్రధాన పార్టీ లకు చెందిన తాజా మాజీ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ (బిఆర్ఎస్), గడ్డం వంశీ కృష్ణ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), గోమాసు శ్రీనివాస్ (భారతీయ జనతా పార్టీ), ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రస్తుతం పోటీలో ఉన్నారు. నియోజకవర్గంలో భాజపా, తెరాస, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొని ఉండడం, ఓటర్ల నాడి ఏవిధంగా ఉంటుందో ఏమాత్రం అంతుచిక్కని స్థితిలో తాము ఎక్క డికి వెళ్ళినా ప్రజలు ఆదరణ చూపుతున్నారని భావిస్తున్న అభ్యర్థులు ముగ్గురూ విజయంపై విశ్వాసంతో ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ శాఖల మాజీ మంత్రి, రాష్ట్ర సమితి సీనియర్ నేత, తాజా మాజీ ధర్మపురి శాసనసభ్యుడు కొప్పుల ఈశ్వర్ ఆపార్టీ అభ్యర్థిగా అభివృద్ధి, ఇటీవల శాసన సభ ఎన్నికలలో ఓటమి పాలైన సానుభూతి ప్రధాన ప్రచారాస్త్రంగా, కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిచిన గడ్డం వంశీ కృష్ణ.. తన తాత కాంగ్రెస్ వరిష్ఠ నేత, కేంద్ర మాజీ మంత్రి కాకాగా సుపరిచితులు, పెద్దపెల్లికి గతంలో ఎంపీగా ఉన్న గడ్డం వెంకట స్వామి, తన తండ్రి గతంలో పెద్ద పెల్లి ఎంపీగా ఉన్న, ప్రస్తుతం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, అలాగే పెదనాన్న, మాజీ మంత్రి, ప్రస్తుత బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ల పలుకుబడులను వినియోగిస్తూ, ఏడు సెగ్మెంట్లలో అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్న అదనపు బలంతో, భాజపా పక్షాన నిలిచిన గతంలో పెద్ద పెల్లి ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలైన గోమాసు శ్రీనివాస్ ప్రధాని నరేంద్ర మోడీ చరిష్మా ప్రధాన ఆయుధంగా, తమకు వీలయిన అందుబాటులో ఉన్న అన్ని ప్రచారాస్త్రాలు వాడి గెలుపుపై ధీమాతో ఉన్నారు. మూడు పార్టీల అభ్యర్థులు పోటీ పడుతూ, తమ అమ్ముల పొదలలోగల సకల అస్త్రాలను వినియోగించి, ప్రచార ఘట్టంలో ముందుకు సాగారు. పార్టీల పక్షాన వీఐపీలు అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేపట్టడంతో ఈసారి ప్రచారం ఉత్సాహంగా సాగగా, ప్రచార సభలో పాల్గొనడం, ప్రధాన పార్టీలు ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహించారు. సమావేశాలు, సందళ్ళు, ప్రచార ఆర్భాటాల గడువు తీరిన నేపథ్యంలో, అభ్యర్థులు, వారి మద్దతు దారులు, కార్యకర్తలు, ప్రధానంగా బంధుగణం ఓటర్లను స్వయంగా కలిసి ఇల్లిల్లూ తిరగడంపై దృష్టి నిలిపారు.

# కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో ముస్లిం జనాభా 43 శాతం పెరిగింది

**మోదీ లేకపోతే భారత్ మరో పాకిస్తాన్ లా మారే ప్రమాదం**

**కొన్ని ఇస్లాం సంస్థలు భారత్ ను ఇస్లామిక్ దేశంగా చేసే కుట్ర చేస్తున్నయ్**

**కరీంనగర్ మహా బైక్ ర్యాలీలో బండి సంజయ్ సంచలన కామెంట్స్**




**కరీంనగర్ టౌన్ మే 11 (ప్రజామంటలు):**
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నరేంద్రమోదీ లేని భారత్ దేశాన్ని ఊహించుకోలేమని చెప్పిన బండి సంజయ్. మోదీ మళ్లీ ప్రధాని కాకుంటే భారత్ మరో పాకిస్తాన్ లా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మైనారిటీ సంతూష్టీకరణ విధానాల వల్ల 1950 నుండి 2015 వరకు భారత్ లో హిందువుల జనాభా 8 శాతం తగ్గితే. ముస్లిం జనాభా ఏకంగా 43 శాతం పెరిగిందని మండిపడ్డారు. కొన్ని ఇస్లామిక్ సంస్థలు భారత్ ను మరో ఇస్లామిక్ దేశంగా మార్చేందుకు చేస్తున్న కుట్రలో భాగమే మస్లిం జనాభా పెరుగుదల అని పేర్కొన్నారు. తాను ఎంపీగా గెలిపిస్తే 'హమ్ దో. హమారే దో (మేమిద్దరం. మాకిద్దరు) అనే కుటుంబ నియంత్రం విధానానికి ఓటేస్తానని చెప్పారు. పొరపాటున కాంగ్రెస్, బీఆర్ఎస్ గెలిస్తే.. వాళ్లంతా "హమ్ చార్. హమారే చాలీస్ (మేం నలుగురం. 40 మందిని కంటాం) అనే విధానానికి ఓటేస్తారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి ఆఖరి రోజైన కరీంనగర్ లో బండి సంజయ్ కు మద్దతుగా వేలాది మంది యువత 'మహా బైక్ ర్యాలీ' నిర్వహించింది. వేలాది మంది యువత స్వచ్ఛందంగా తరలివచ్చి కరీంనగర్ బైపాస్ వద్దనున్న మానేరు స్కూలు నుండి రాంనగర్, గీతాభవన్, ప్రతిమ చౌరస్తా, కలెక్టరేట్, భగత్ నగర్, అంబేద్కర్ స్టేడియం, కట్టరాంపూర్, కోతిరాంపూర్, కమాన్ చౌరస్తా, టవర్ సర్కిల్ మీదుగా కోర్టు చౌరస్తా వరకు మహా బైక్ ర్యాలీ నిర్వహించారు. వేలాది బైక్ ర్యాలీలతో కరీంనగరమంతా కాషాయ సంద్రమైంది. ఈ సందర్భంగా రాంనగర్ వద్ద బండి సంజయ్ ప్రసంగిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూఎన్ని పార్టీలు ఎంత ప్రచారం చేసినా ప్రజలంతా కోరుకునేది ఒక్కటే. మోదీ మళ్లీ ప్రధాని కావాలి. బండి సంజయ్ మళ్లీ ఎంపీ కావాలని కోరుకుంటున్నరు. వాళ్లందరికీ నా పాదాభివందనం. నేనెవరో మీకు తెలుసు. మీకోసం టవర్ సర్కిల్, రాంనగర్ చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, బస్టాండ్ సహా గల్లీగల్లీలో కొట్లాడిన. ధర్మానికి ఆపదొస్తే, హిందూ సమాజానికి విఘాతం కలిగిస్తే అడ్డుకుని నేను, రాజాసింగ్ పోరాడినం. పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నడైనా ప్రజలను కలిశారా? ఎన్నడైనా కరీంనగర్ ప్రజల పక్షాన పోరాటాలు చేశారా? కనీసం కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచారా? ప్రజలకు కష్టాలొస్తే అర్ధరాత్రి కూడా పోయి అండగా నిలిచిన. కలెక్టరేట్ వద్ద ధర్నా చేసిన.

ఇండియా గెలిస్తే పాకిస్తాన్ జెండాలతో తిరుగుతుంటే, ఆ లుచ్చా నాకొడుకులను ఉచ్చపోయించిన. మీకోసం జైలుకు పోయిన. రైతులకు అండగా నిలిచిన. ఆర్టీసీ కార్మికుల కోసం కొట్లాడిన. ఉద్యోగుల కోసం జైలుకు పోయిన. నిరుద్యోగుల కోసం జైలుకు పోయిన.ఇన్ని ఉద్యమాలు చేస్తూనే నన్ను గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి రూ.12 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చిన. సాక్షాత్తు ప్రధానమంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులు ప్రారంభించిన. మీరు తయారు చేసిన బండి సంజయ్ కు అన్యాయం చేయకండి. మాలాంటి ధర్మ రక్షకులకు, ఉద్యమాలు చేసే వాళ్లకు మీరు అండగా నిలవకపోతే ధర్మం కోసం పాటుపడే వాళ్లు వెనకడుగు వేస్తారు. ప్రజల కోసం పోరాడే వాళ్లు వెనుకంజ వేస్తారు. మోదీ మళ్లీ ప్రధాని కాకపోతే భారత్ మరో పాకిస్తాన్ లా మారే ప్రమాదం ఉంది. టెర్రరిస్టు కార్యకలాపాలు పెరుగుతాయి. కొన్న ఇస్లాం సంస్థలు ఈ దేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నయి. అందులో భాగంగానే దేశంలో ముస్లింల జనాభా 43 శాతం పెరిగితే.. హిందూ జనాభా 8 శాతానికి తగ్గింది. ఇదే జరిగితే భారత్ పరిస్థితి ఏమిటో, ఎలాంటి ప్రమాదకరంగా మారబోతుందో అర్ధం చేసుకోండి. మీరు వేయబోయే ఒక్క ఓటే రామబాణమై భారత్ ను ఇస్లామిక్ దేశంగా మార్చాలనుకునే వాళ్ల గుండెలను చీల్చాలి. గుండెల్లో గునపాలు దిగాలే. రేవంతన్న అంటున్నడు. సర్జికల్ స్ట్రయిక్ జరిగిందని గ్యారంటీ ఏందని అడుగుతున్నడు. రా. నిన్ను విమానంలో, హెలికాప్టర్ లో సరిహద్దు దాకా తీసుకుపోతా ఇక్కడన్న మాట జవాన్లను అడుగు. ఎట్లా సర్జికల్ స్ట్రయిక్స్ చేశారో నీకు రుచి చూపిస్తారు. జవాన్లను అవమానించేలా సీఎం మాట్లాడుతున్నడు. ఇదే రేవంత్ రెడ్డి. మోదీ లేకపోతే దేశమే లేదు. మోదీ లేకపోతే పాకిస్తాన్, బంగ్లాదేశమొల్లు వస్తరని చెప్పిన విషయం మర్చిపోయినవా? మీ కాంగ్రెస్ పాలనలోనే గోకుల్ చాట్, లుంబినీ పార్క్, దిల్ సుఖ్ నగర్ లలో బాంబు పేలుళ్లు జరిగిన టెర్రరిస్టులు విస్ఫోటనం సృష్టించిన విషయం మర్చిపోయినవా? మోదీ పాలనలో బాంబు బ్లాస్టు కాదు కదా. సుతిలీ బాంబులు కూడా పేలలేదనే సంగతి గుర్తుంచుకో. ఈ కాంగ్రెసోళ్లు (శ్యాంపిట్రోడాను ఉద్దేశించి) మన సౌతిండియన్స్ ను ఆఫ్రికన్లలాగా ఉన్నారని అంటున్నడు. మన ఆస్తిలో 60 శాతం స్వాధీనం చేసుకుంటామని అంటున్నడు.మీరు నన్ను ఎంపీగా గెలిపిస్తే మళ్లీ కొట్లాడుడే. 6 గ్యారంటీల అమలుపై కొట్లాడేది బండి సంజయే. కేసీఆర్ సర్కార్ మెడలు ఎట్లా వంచానో 6 గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ మెడలు వంచేది కూడా బండి సంజయే. ముస్లింలంతా ఒక్కటై బండి సంజయ్ ను ఓడించాలని కేసీఆర్ అంటున్నడు. హిందువులారా! మీరంతా స్పందించండి. నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ సహా హిందూత్వ వాదులంతా కరీంనగర్ తరలిరండి. బండి సంజయ్ ను గెలిపించి హిందువుల దమ్మేందో చూపండి. కేసీఆర్ నేను హిందూ ఓటు బ్యాంకు ద్వారా పక్కా గెలవబోతున్నా. హిందువుల ఆశీర్వాదంతోనే బంపర్ మెజారిటీతో గెలవబోతున్నా, నేను ఓడిపోతే పక్కా రాజకీయ సన్యాసం తీసుకుంటా. నా నోటి నుండి హిందుత్వం గురించి మాట్లాడను. కాషాయ జెండాను పట్టుకోను. కేసీఆర్ నువ్వు ఓడిపోతే కిందమీద మార్చుకుని. బీఆర్ఎస్ పార్టీని మూసేసి ఫాంహౌజ్ కు పారిపోతవా? దమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలి. కేసీఆర్ ఎంత మోసగాడంటే, ఫోన్ ట్యాపింగ్ కేసులో అడ్డంగా దొరికిపోతాడనే భయంతో దేశభద్రత, ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి ఇంటెలిజెన్స్ వద్ద ఉన్న డేటా మొత్తం ధ్వంసం చేసిండు. ఈ మాట అన్నది రేవంత్ రెడ్డే. రేవంతన్నా దేశద్రోహానికి పాల్పడ్డ కేసీఆర్ ను ఎందుకు బొక్కలో వేయలేదు. ఎందుకు తాట తీయలేదు? దేశ భద్రత డేటాను ధ్వంసం చేస్తే ఎట్లా ఊరుకుంటావ్. కేసీఆర్ పక్కా దేశ ద్రోహి. బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే కేసీఆర్ ను ఈపాటికే బొక్కలో వేసేటోళ్లం. కేసీఆర్ ఫాంహౌజ్ లోకి గుసాయించి సర్జికల్ స్ట్రయిక్స్ చేసి ఆయన సంగతి తేల్చేటోళ్లం, కరీంనగర్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై 12 శాతం ఓటు బ్యాంకుతో నన్ను ఓడించే కుట్ర చేస్తున్నరు. నాకు మీరున్నారనే ధైర్యంతో కొట్లాడుతున్న. నా హిందువులంతా నా వెంట ఉన్నారనే ధైర్యంతోనే గల్లీగల్లీలో తిరిగి మీకోసం పోరాడుతున్న. నన్ను ఓడించడానికి వందల కోట్లు ఖర్చు చేస్తున్నరు. ఆ రెండు పార్టీల లక్ష్యం బండి సంజయ్ ను ఓడించడం. మోదీ మళ్లీ ప్రధాని కాకుండా చూడటం.ఇద్దరూ రాత్రి కూర్చొని మాట్లాడుకుని మసీదు కేంద్రంగా ఓటుకు రూ.5 వేలిచ్చి గెలవాలని కుట్ర చేస్తున్నరు.ఈ సమయంలో హిందూ సమాజం ఏకం కాకుంటే ధర్మరక్షకులే కరువైతారు. వాళ్లంతా ఏబీసీ గ్యాంగ్ ఏ అసదుద్దీన్ బి అంటే బీఆర్ఎస్, సీ అంటే కాంగ్రెస్ ఈ ఏబీసీ గ్యాంగ్ నన్నేం చేస్తది. నా వెనుక రాజాసింగ్ ఉన్నడు.నా వెనుక మోదీ ఉన్నడు.నా వెనుక సాక్షాత్తు ఆ శ్రీరామచంద్రుడే ఉన్నడు. నా వెనుక మీరంతా ఉన్నరు. మీ ఆశీస్సులతో బంపర్ మెజారిటీతో గెలవబోతున్నా అన్నారు.

## ఎన్నికల్లో కాంగ్రెస్‌నే ఆశీర్వదించండి

**వీడియో సందేశంలో సిఎం రేవంత్ వినతి**

**హైదరాబాద్,మే11:** సార్వత్రిక సమరానికి మరి కొన్ని గంటలే మిగిలి ఉన్న వేళ.. సీఎం రేవంత్ రెడ్డి ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటానికి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని, ఇండియా కూటమిని గెలిపించాలని ప్రజలకు విన్నవించారు.

'ఇవి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి జరుగుతున్న ఎన్నికలు. అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని రాశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రిజర్వేషన్ల వల్లే పురోగమన దిశలో పయనించారు. రాజ్యాంగం మార్చాలని బీజేపీ కుట్ర చేస్తోంది. రిజర్వేషన్ల రహిత దేశంగా మార్చాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. ప్రపంచ దేశాలతో పోటీ పడాల్సిన భారత్ బీజేపీ కుట్రలకు బలి అవుతోంది. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఆశీర్వదించండి' అని రేవంత్ కోరారు.

## బి.ఆర్.ఎస్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యే సంజయ్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ



**జగిత్యాల మే 11 (ప్రజామంటలు):**
జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ , రాంబజార్, టవర్ సర్కిల్, మార్కెట్ రోడ్డు, మోచి బజార్, తహసిల్ చౌరస్తా, యావర్ రోడ్డు,టౌన్ హాల్ వరకు బిఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంటు అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ , ఎమ్మెల్సీ ఎల్. రమణ, జెడ్పీ చైర్ పర్సన్ దా వసంత సురేష్ , మాజీ మంత్రి రాజేశం గౌడ్. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు గట్టు సతీష్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

## నా బలం...బలగం జగిత్యాల ప్రజలే

### జగిత్యాల ప్రజల రుణం తీర్చుకునే అవకాశం ఇవ్వండి



**జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 10 (ప్రజామంటలు):**
రాజకీయాలు అతీతంగా అండగా నిలువండి.ఆశీర్వదించండి.ఆలోచించండి.మీ బిడ్డగా ఆదరించండి.ఎం పీ గా గెలిపించండి.చల్గాల్ లో కాంగ్రెస్ పార్టీ ఎం పి అభ్యర్థి జీవన్ రెడ్డీ ప్రచారం.చల్గాల్,మోర్పల్లి, మోహన్ రావు పేట, తాటిపల్లి, హస్నాబాద్, చేర్లపెల్లి గ్రామాల ప్రజలను సమావేశం నిర్వహించడం జరిగింది.కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ నాయకులు.కండువా కప్పిపార్టీ లోకి ఆహ్వానం పలికారు.వందలాది మంది తరలివచ్చినారు.మా ఓటు మీకే అంటూ మద్దతు తెలిపారు.జీవన్ రెడ్డి కి మంగళ హారతులతో స్వాగతం పలికి నాగలి బహుకరణ చేశారు.అత్యదిక మెజారిటీ తో గెలిపించుకుంటామని నినదించారు. ఆత్మీయంగా పలుకరిస్తూ ఓట్లు అభ్యర్థించారు జీవన్ రెడ్డి. అనంతరం జీవన్ రెడ్డీ మాట్లాడుతూ కరీంనగర్ ప్రజలకు సోనియా గాంధీ ఇచ్చిన మాట కోసం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.ఐదేళ్ల కాలంలో ఎం పీ గా అరవింద్ చేసింది ఏమీ లేదు.పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని ఐదేళ్లు పట్టించుకోకుండా ఎన్నికల వేళ మళ్ళీ ఓటర్లను మభ్య పెట్టేందుకు ముందుకు వస్తున్నారు.రాముడి పై కాంగ్రెస్ పార్టీ కి ఉన్న భక్తి కూడా బిజెపి పార్టీ కి లేదు.50 ఏళ్ల క్రితమే నిర్మించిన పోచంపడ్ ప్రాజెక్ట్ కు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ గా పేరు పెట్టామని గుర్తు చేశారు.ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ మీ సేవలో ఉన్నా,నియోజక వర్గ ప్రజలు నా బిడ్డలు.నాలుగు దశాబ్దాలుగా ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నను,రాజకీయ జన్మనిచ్చిన జగిత్యాల ప్రజలకు సేవలు చేసేందుకు ఎంపీగా బరిలో నిలిచిన,సచ్చేదాకా ప్రజా సేవలో ఉంటా, మంచం పడుకున్నా ఫోన్ లో మాట్లాడి ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ సేవలు అందిస్తాను. చల్ గల్ లో 25 ఎకరాల్లో మామిడి మార్కెట్ ఏర్పాటు చేసిన అని గుర్తు చేశారు.తెలంగాణ రైతాంగం వై ఎస్ రాజశేఖర్ రెడ్డిని తలుచుకుంటుంది.రైతుల కోసం 2004 లో ఉచిత విద్యుత్ అందజేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నారా?గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కల్లం కాడా వడ్లు తూకం వేసినం. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి పెట్టుబడి రెట్టింపు చేశారు. యూరియా 50 కిలోల నుండి 45 కిలోలకు తగ్గించారు. కాంగ్రెస్ పార్టీ 2008 లో ఏక మొత్తంగా లక్ష రూపాయలు మాఫీ చేసినం. కాంగ్రెస్ వస్తే పెన్షన్ బందు అయితది..అని బెదిరించింది.కాంగ్రెస్ పార్టీ పెన్షన్ 4000 ఇస్తాం. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 లకే సిలిండర్ అందిస్తున్నం. పదేళ్ల లో గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇచ్చారా? కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లో రేషన్ కార్డులు జారీ చేస్తాం. గల్ఫ్ లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు రు.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తాం. బీడీలు చేసే కార్మికులకు ఆంక్షలు లేకుండా పెన్షన్ ఇస్తాం.వెయ్యి బీడీలు కులి రేటు రు.300 ఇస్తాం.ఊరూరా రోడ్లు వేసిన, గీత కార్మికులకు అండగా నిచిన అని గుర్తు చేశారు. ఎమ్మెల్యే గా ఓడిపోయినా ప్రజల మధ్యే ఉంటూ సేవలు అందిస్తున్న. చలగల్ లో సబ్ స్టేషన్ ఏర్పాటు చేసిన.చల్ గల్ ప్రదర్శన క్షేత్రంలో ఉద్యానవన కలశాల ఏర్పాటు చేస్తాం. చక్కర కర్మాగారం వచ్చే ఏడాది డిసెంబర్ లో పునః ప్రరంభిస్తా.పార్లమెంట్ నా మొదటి ప్రసంగం చక్కర కర్మాగారం పై చేస్త.దసరాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తా.జగిత్యాల కోదండ రామాలయం, ఎడ్ల అంగడి రామాలయ భూములు కబ్జా కాకుండా జై శ్రీరామ్ అంటూ భూములు కాపాడిన. జీవన్ రెడ్డి ఆత్మీయత కు, అరవింద్ అహంకారానికి మద్య జరుగుతున్న పోటీ అని, రాజకీయాలకు అతీతంగా అండగా నిలువండి. ఆలోచించండి. మీ బిడ్డగా ఆదరించండి. ఆశీర్వదించండి. ఈ కార్యక్రమంలో జున్ను రాజేందర్, జితేంద్ర రావు, పెండెం నాగలక్ష్మి రాములు, బోల్ల సతమ్మ గంగారాం, భూమా రెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ప్రతీక కాంగ్రెస్ పార్టీ

**- మీకు అండగా నేను ఉంటా**

**- ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ ను గెలిపించండి - ప్రభుత్వ విప్ అడ్లూరి**



గొల్లపల్లి మే 11 (ప్రజామంటలు): ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా గొల్లపల్లి మండలం చందోలి గ్రామంలో ఉపాధి హామీ కార్మికులను కలిసిన ప్రభుత్వ విప్, ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్. ఈ సందర్భంగా అభివృద్ధికి ప్రతీక కాంగ్రెస్ పార్టీనేనని, మీకు ఏ సమస్యలోనైన మీకు అండగా నేను ఉంటా, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వారి వెంట సీనియర్ నాయకులు కటారి చంద్రశేఖర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఇండో - జపాన్ ఎడ్యుకేషన్ లీడర్షిప్ సమ్మిట్ కు హాజరైన లయన్ ముచ్చరాజి రెడ్డి




**ధర్మసాగర్ మే 11 (ప్రజామంటలు):**
బ్రెయిన్ ఫీడ్ సంస్థ నిర్వహిస్తున్న ఇండో-జపాన్ ఎడ్యుకేషనల్ లీడర్షిప్ సమ్మిట్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంకు భారతదేశంలోని ప్రముఖ విద్యాసంస్థల అధినేతలు సుమారు 40 మంది బృందం పాల్గొన్నారు. మే 5 నుండి 12 వరకు జరిగే ఈ కార్యక్రమానికి తెలంగాణ నుండి ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ సాదుల మధుసూదన్ తో పాటు, ట్రస్మా సభ్యులు శ్రీనివాస రామానుజన్ విద్యాసంస్థ డైరెక్టర్, లయన్ ముచ్చ రాజిరెడ్డి, కరస్పాండెంట్ అరుణ రాజిరెడ్డి లు, బ్రెయిన్ ఫీడ్ డైరెక్టర్ కాకానీ బ్రహ్మం నేతృత్వంలో పాల్గొన్నారు. జపాన్ విద్యా విధానంలోనే ఉత్తమ పద్ధతుల అధ్యయనము వారి సంస్కృతి, సంప్రదాయాలు భారతదేశ ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచే ఎడ్యుకేషన్ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్స్ గూర్చి చర్చించి అధ్యయనం చేశారు. జపాన్ రాజధాని టోక్యోలోని ఇండియన్ ఏంబసి కార్యాలయంలో అధికారికంగా జరిగిన సమావేశంలో ఇండియన్ డిప్యూటీ కమిషనర్ మయాంక్ జోషి ప్రసంగించారు. భారత్ -జపాన్ సంబంధాల గురించి జపాన్ విద్యా విధానం గురించి ప్రసంగించారు. జపాన్ విద్యార్థులకు క్రమశిక్షణ, లైఫ్ స్కిల్స్ కు అత్యంత ప్రాధాన్యాన్ని ఇస్తారని తెలిపారు. లయన్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ, జపాన్ విద్యా విధానంలో గమనించిన ప్రధాన అంశాలను తెలియజేశారు. ప్రీ ప్రైమరీ తరగతుల నుండి పిల్లలకు లైఫ్ స్కిల్స్, వ్యాల్యూ ఎడ్యుకేషన్, స్వచ్ఛత, శుభ్రత, సహజ వనరులను వృధా చేయకుండా వాడటం, సమయపాలన, పర్యావరణం పట్ల గౌరవం, బాధ్యతయుతంగా ప్రవర్తించడం అత్యంత ప్రాధాన్యతనిస్తాని అన్నారు. జపాన్ పాఠశాలలో విద్యార్థులు ప్రతిరోజు స్కూల్ టైం అయిపోయాక తరగతి గదులను శుభ్రం చేసి ఇంటికి వెళతారని, చెత్తను కేవలం చెత్తబుట్టలోనే వేస్తారని అన్నారు. జపాన్లో నేర్చుకున్న విషయాలను విద్యాసంస్థలతో చర్చించి తగిన ట్రైనింగ్ ఇచ్చి అమలు పరచడానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఎన్నికల విధులకు 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సిద్ధం

### ఒటేయ్యడానికి మీరు సిద్ధమా?

**జగిత్యాల మే 11 (ప్రజామంటలు):**



జాతీయ సేవా పథకం జగిత్యాల జిల్లా నోడల్ అధికారి డాక్టర్ పడాల తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల జగిత్యాలలో 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మే 13, 2024న జరగబోనున్న 18వ లోకసభ ఎన్నికల విధులకు మేం సిద్ధం ఒకటేయ్యడానికి మీరు సిద్ధమా.... సిద్ధం కావాలని ఓటర్లను, యువకులను, వయోవృద్ధులను, విద్యావంతులు, పౌరులను గురించి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి షేక్ యాస్మిన్ భాష, ఆర్డీవో పులి మధుసూదన్ గౌడ్ ఆదేశానుసారం జిల్లాలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 200 మంది విద్యార్థులు జిల్లా కేంద్రంలోని వివిధ పోలింగ్ కేంద్రాలలో సేవలందించనున్నారు. వీరు పోలింగ్ స్టేషన్ దగ్గర ఓటర్లను క్యూ లైన్ లలో వరుసలో ఉంచడం, ఓటర్లకి నీరు అందించే సదుపాయం, వృద్ధులకి వికలాంగులకి వీల్ చైర్ ద్వారా పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లడం, అత్యవసర పరిస్థితుల్లో ప్యారా మెడికల్ సిబ్బందితోపాటు ఎన్నికల సిబ్బందికి మరియు ఓటర్లకు తగిన సహాయం అందించడం వంటి క్రమశిక్షణ పరమైన, సహకార ధోరణితో సేవలు అందిస్తారని, ఎలక్షన్ల విధులలో పాల్గొనడం అంటే దేశ సేవలో పాల్గొన్నట్టేనని జాతీయ సేవా పథకం వాలంటీర్ గా ఉండడం మీ అదృష్టం అని ఈ చక్కటి అవకాశాన్ని దేశ సేవలో వినియోగించి శాంతియుతంగా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సక్రమంగా జరగడంలో మీ వంతు సహకారం అందించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యాంసాని సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ అంబాల శంకరయ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిశాల రాజేందర్రావు

### గెలుపుకై ప్రచారం చేస్తున్న తంగళ్ళపల్లి రమేష్



**ఎల్కతుర్తి మే 11 (ప్రజామంటలు):**
ఎల్కతుర్తి మండలం జిలుగుల గ్రామంలో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిశాల రాజేందర్ రావు గెలుపు కోసం పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు గ్రామంలో ఉపాధి హామీ పథకం పని దగ్గర ఉపాధి కూలీలకు కాంగ్రెస్ పార్టీ మెనీ ఫెస్టో కొత్త పథకాలను వివరించడం జరిగింది వారికి శీతల పానీయాలు అందించడం జరిగింది జీలుగుల గ్రామము నుండి అత్యధిక మెజారిటీ చూపించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తంగళ్ళపల్లి రమేష్ కోరారు ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దానం నాగేందర్ కు మద్దతుగా భారీ బైక్ ర్యాలీ

### అడ్డగుట్టలో కాంగ్రెస్ ప్రచారం

**సికింద్రాబాద్ మే 11 (ప్రజామంటలు):**
సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ కు మద్దతుగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. శనివారం అడ్డగుట్ట డివిజన్ లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జై కాంగ్రెస్...దానం నాగేందర్ జిందాబాద్..అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. దేశాన్ని మతాల పేరిట విభజించి, మరోసారి అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పార్టీ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ సీనియర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఓటు' రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు

### మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవెర్నెస్




**సికింద్రాబాద్ మే 11 (ప్రజామంటలు):**
ప్రతి ఒక్క ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవడం బాధ్యతగా భావించాలని మక్తాల ఫౌండేషన్ అద్యక్షుడు జలంధర్ గౌడ్ అన్నారు. ఓటు హక్కుపై శనివారం సిటీలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సిటీలో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి తన వంతు బాధ్యతగా గత 25 రోజులుగా సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల పరిధిలో తన బైక్ పై ప్రచారం నిర్వహిస్తున్నానని తెలిపారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ఈనెల 13న ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావించి ఓటు వేయాలని, తాము వేయడంతో పాటు తమ ప్యామిలీ మెంబర్స్ ను, బంధువులను, మిత్రులను ప్రొత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పూర్ణచందర్, డి. ప్రకాశ్, జే. సుబ్రహ్మణ్యం, ఎం. శివకుమార్, ధీరజ్, జే. భాస్కర్, రాజు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనతో కెసిఆర్ లేని లోటు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తుంది

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 11 (ప్రజామంటలు):**



జగిత్యాల బిఆర్ఎస్ పార్టీ కార్యలయం మోతే రోడ్డు లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జెడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... మే 13 న జరిగే ఎన్నికల్లో బి అర్ ఎస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంటు అభ్యర్థి బాజిరెడ్డి విజయం సాధిస్తారు. బిఆర్ఎస్ నాయకులు అందరూ సమిష్టిగా పనిచేయటం జరిగింది. కాంగ్రెస్ పాలనలో కెసిఆర్ లేని లోటు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తుంది. తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ జగిత్యాల వచ్చిన రోజు ప్రజలనుండి అభిమానం చాలా గొప్పగా ఉంది. పార్లమెంట్ లో తెలంగాణ గళం వినిపించింది బిఆర్ఎస్ పార్టీ ఎంపీ లు మాత్రమే. గతం లో మాజీ ఎంపీ కవిత కు ఉత్తమ పార్లమెంటరీ అవార్డు కూడా రావడం జరిగింది.వచ్చే డిల్లి ప్రభుత్వం లో హంగ్ వచ్చే అవకాశం ఉంది.బి అర్ ఎస్ పార్టీ ప్రధాన భూమిక పోషిస్తుంది.ప్రజలు గమనించి ఓట్లు వేయాలి.బాజీ రెడ్డి గెలిస్తే వారి విశేష అనుభవం తో నిదులు తీసుకువస్తారు.తెలంగాణ హక్కుల కోసం కొట్లాడతారు.కేసిఆర్ హయం లో గడప గడపకి బి అర్ ఎస్ సంక్షేమ పథకాలు అందాయి.6 నెలల్లో కాంగ్రెస్ పాలన ను,కేంద్రం లో బీజేపీ పాలనను ప్రజలు గమనిస్తున్నారు...విసుగు చెందారు.30 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం అని చెప్పుకునే కాంగ్రెస్ రేవంత్ రెడ్డి. నియామకాలు ఎప్పుడు జరిగాయి అనేది ప్రజలకు తెలుసు.ఆరు గ్యారంటీ లు పచ్చి మోసం. ఎక్కడికీ వెళ్లిన అక్కడి దేవుని పై ఓట్టు వేస్తూ ప్రజల్ని మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ నాయకులు సైతం అసత్య ప్రచారాలు చేస్తున్నారు. బిఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నిదులు శూన్యం. బీజేపీ, బి అర్ ఎస్ రెండు ఒక్కటే అని జీవన్ రెడ్డి అంటున్నారు. గత ఎంపి ఎన్నికల్లో బీజేపీ కి సహకరించి, డిపాజిట్ గల్లంతు చేసుకున్నది కాంగ్రెస్ పార్టీ. ఢిల్లి లో కొట్లాట గల్లి లో దోస్తీ లా ఇక్కడి కాంగ్రెస్ తయారయింది అని అన్నారు.జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ
బాజీ రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేశారు. సీరియల్ నెంబర్ 2 పై కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ అబద్దాల తో గెలిచింది. కేసిఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఎక్కడా అమలు కాలేదు అని ,బి అర్ ఎస్ పార్టీ కి ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు గట్టు సతీష్, జడ్పీటీసీ మహేష్, నాయకులు క్యాదాసు నాగయ్య, జుంభర్తీ శంకర్, సుమన్ రావు, రంగు మహేష్, శరత్ రావు, రాగుల రాజు, జంగిలి శశి, అబ్దుల్ అజీజ్, కౌన్సిలర్ క్యాదాసు నవీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చింతలపల్లిలో ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ గెలుపు కొరకు

### జోరుగా ప్రచారం చేస్తున్న మహిళలు



**ఎల్కతుర్తి మే 11 (ప్రజామంటలు):**
హుస్నాబాద్ నియోజకవర్గం లోని ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో ఎంపీ అభ్యర్థి బోయిన్పల్లి వినోద్ కుమార్ గెలుపు కొరకు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆదేశాల మేరకు చింతలపల్లి ఎంపీటీసీ బొంకూరి రజిత రవీందర్ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున కడప గడపకు ప్రచారం చేస్తూ టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పలు అభివృద్ధి పనులపై వివరణ ఇస్తూ భారీ మెజారిటీతో వినోద్ కుమార్ ను గెలిపించుకుంటే మనకు పలు అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి అభివృద్ధి పనిపై వివరణ ఇస్తూ మహిళలకు అవగాహన కల్పిస్తూ వినోద్ కుమార్ కు ఓటు వేసి గెలిపించాలని కోరారు ఈ ప్రచారంలో పాల్గొన్నవారు ఎంపిటిసి రజిత రవీందర్ మహిళా నాయకురాలు బొంకూరి రాధ, మంజుల, కోమల, రమ, లలిత, జ్యోతి, యువకులు కార్తీక్, నవీన్, అనిల్, శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన గ్యారంటీ హామీలను అమలు చేసి తీరుతాం

**ఎంపీగా గడ్డం వంశీకృష్ణ ను భారీ మెజారిటీ తో గెలిపించాలి : అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**బుగ్గారం కాంగ్రెస్ సభ కు తరలి వచ్చిన మహిళా లోకం**



బుగ్గారం మే 11 (ప్రజా మంటలు) :
గడ్డం వంశీకృష్ణ ను పెద్దపెల్లి పార్లమెంటు ఎంపి గా భారీ మెజారిటీతో గెలిపించాలని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని, ఆగస్టు 15 లోపు రైతులకు రెండు లక్షల ఋణ మాఫీ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసి తీరుతుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సభకు మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ ఈ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలు ఏమున్నా విడతల వారీగా పరిష్కరించే బాధ్యత మాదీ అని అడ్లూరి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల సుభాష్‌తోపాటు వివిధగ్రామాలనాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# కరీంనగర్‌లో కాంగ్రెస్ జన ప్రభంజనం

**వెలిచాల “శక్తి ప్రదర్శన”- 70 వేల మందితో భారీ ప్రదర్శన.**

**గెలుపు ఖాయమని రాజేందర్ రావు వెల్లడి**

**- వెయ్యి మంది కళాకారులతో కాంగ్రెస్ మీటింగ్ జన సంద్రం**



కరీంనగర్ మే 11 (ప్రజా మంటలు) :
ఎన్నికల ప్రచారం చివరి రోజున కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు కు మద్దతుగా, దాదాపు 70 వేల మంది హాజరైన ప్రజలతో గీతా భవన్ చౌరస్తాలో కాంగ్రెస్ శక్తి ప్రదర్శన నిర్వహించారు. శక్తి యాత్ర పేరుతో ప్రచారం చివరి రోజు నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన జన ప్రభంజనం కాంగ్రెస్ నాయకుల ఉత్సాహాన్ని పెంచింది. వెయ్యి మంది కళాకారులు భిన్న ప్రదర్శనల్లో అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు హుషారుగా పాల్గొని, తన గెలుపు కోసం స్వచ్చందంగా తరలివచ్చిన జన సమూహాన్ని చూసి రాజేందర్ రావు రెట్టించిన ఉత్సాహంతో కళాకారుల స్టెప్పులకు జత కలిశారు. నృత్యం చేస్తూ, డప్పు వాయిస్తూ కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపిస్తామని ప్రతిన పూనిన కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యం నెరవేరడం ఖాయంగా శక్తి యాత్ర నిరూపించిందని, భారీ సందడి, ప్రముఖ నేతల ప్రసంగం అనంతరం గీతా భవన్ చౌరస్తా నుంచి బస్ స్టేషన్ వరకు ఓపెన్ టాప్ వాహనంపై నిల్చుని వెలిచాల రాజేందర్ రావు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రచారం చివరి రోజైనా శనివారం నాటి శక్తి యాత్రకు హాజరైన జన ప్రభంజనం కాంగ్రెస్ గెలుపుకహాయమని నిరూపించిందని వెలిచాల రాజేందర్ రావు తనప్రసంగంలో అన్నారు. స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతికి పాల్పడి 30శాతం కమిషన్ పంచుకున్న అవినీతిపరులు, కరీంనగర్ ప్రజల సమస్యలపై కనీస అవగాహనలేని దద్దమ్మలు మనకి అవసరమా? అని వెలిచాల రాజేందర్ రావు ప్రశ్నించారు. గత పదేళ్లపాటు ఎంపీలుగా ఉన్న బోయినపల్లి వినోద్ కుమార్, బండి సంజయ్ లు నయా పైసా అభివృద్ధి పనులు చేయలేదని విమర్శించారు. బండి సంజయ్ కి మరోసారి అవకాశం కల్పిస్తే కరీంనగర్ ను అభివృద్ధి చేయడని, తానే ఆర్థికంగా అభివృద్ధి చెందుతాడని పేర్కొన్నారు. 2014లో నామినేషన్ పత్రాలు కొనేందుకు భార్య పుస్తెల తాడు అమ్మిన బండి సంజయ్ ఇప్పుడు వేల కోట్లకు అధిపతి ఎలా అయ్యాడని నిలదీశారు. ఎన్నికల సమయంలో వందల కోట్లు ఎలా ఖర్చు పెడుతున్నాడని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రిజర్వేషన్లను ఎత్తివేస్తామని బహిర్గతంగానే చెబుతోందని, అలాంటి బిజెపికి ఓటు వేయటం అవసరమా? అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాలు తొలగించి, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేస్తాం అంటున్న బిజెపిని బండకేసి కొట్టాలని రాజేందర్ రావు పిలుపునిచ్చారు.

# ఇందిరానగర్‌లో జోరుగా టిఆర్ఎస్ ప్రచారం



ఎల్కతుర్తి మే 11 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్ గ్రామములో టిఆర్ఎస్ పార్టీ గ్రామ అద్దక్షుడు అంబాల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో, సుమారు 150 మందితో ర్యాలీ మరియు ప్రచారం చేయడం జరిగింది. కరీంనగర్ ఎంపీ టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ కు కారు గుర్తుకే ఓటు వేయాలని బ్యాలెట్ నమూనా మీద 03 నెంబర్ పైన మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో ఇందిరానగర్ టిఆర్ఎస్ పార్టీ గ్రామ అద్దక్షుడు అంబాల రాజ్ కుమార్, గ్రామ మాజీ సర్పంచ్ కడారి రమ ప్రసాద్ యూత్ అద్దక్షుడు కడారి మురళి యూత్ ఉపాద్యక్షుడు సందేలా నరేష్ మాజీ వార్డ్ సభ్యులు కడారి సందీప్ టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడారి రాజారాం సాత్తూరి ఐలయ్య, సందేలా సుదర్శన్, కడారి సురేందర్, బొంకూరి రాజీవ్ గాంధీ, బొంకూరి ప్రవీణ్, సాత్తూరి కిరణ్, సందేలా చందు, రమేష్ అంబాల అనిత, జ్యోతి, కావేరి, మానస, రజిత, ప్రవళిక, కవిత, జమున, రవళి, సులోచన, ఎల్లమ్మ, సునీత, గంజి పుష్ప, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాగొడ్డు రామన్నపల్లిలో విస్తృతంగా కాంగ్రెస్ ప్రచారం



ఇల్లందకుంట మే 11(ప్రజామంటలు):
వాగోడ్డు రామన్నపల్లె గ్రామంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కారింగుల రాజేందర్ అధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు కు చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ అందించాలని గ్రామ ప్రజలను కోరారు. తెలంగాణలో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తీర్పునిచ్చి ప్రజా పాలన తెచ్చుకున్నాం. అలాగే దేశంలో పదేళ్ళ చీకటి పాలనను చరమ గీతం పాడి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి, దేశంలో కూడా ప్రజా పాలన తెచ్చుకుందామని ప్రజలను కోరుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నారపు సాయి, కరట్లపల్లి మణి, అన్నారపు సంతోష్, కరట్లపల్లి సంజీవ్, తెప్ప శోభన్, చింతం వంశీ, కారింగుల రాకేష్, గజే సాయి పాల్గొన్నారు.

# బిజెపిలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

చిగురుమామిడి మే 11 (ప్రజామంటలు):



చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ వార్డు సభ్యులు భీమర లక్ష్మణ్ భారతీయ జనతా పార్టీ లో చేరారు. వారికి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, బిజెపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. వీరి తో పాటు, ప్రముఖ వ్యాపార వేత్త వేముల సదానందం, అప్పాల కుమార్, మౌటం అనిల్, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ వార్డు సభ్యులు లక్ష్మణ్ మాట్లాడుతూ..పదేళ్ళ నరేంద్ర మోడీ పాలన ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు, మళ్ళీ కేంద్రంలో మోదీ ప్రభుత్వం వస్తేనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ గెలుపు కొరకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చెప్యాల మురళి మనోహర్, మాజీ మండల అధ్యక్షుడు ఆచ్చ రవీందర్, సీనియర్ నాయకులు గట్టు ఎల్లయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

# ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**ఫ్రీ, ఫెయిర్ ఎన్నికల కొరకే ఫ్లాగ్ మార్చ్**

**అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలి**

**శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**





జగిత్యాల మే 11 (ప్రజామంటలు):
జిల్లా కేంద్రంలో 300 మంది జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో కలసి ఫ్లాగ్ మార్చ్ వంటి కవాతును జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ జెండా ఊపి ప్రారంబించారు. ఈ యొక్క ఫ్లాగ్ మార్చ్ మంచి నీళ్ళ బావి నుండి తీన్ కనీ, టవర్ సర్కిల్, న్యూ బస్ స్టాండ్ ప్రాంతాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... ఈ నెల 13వ తేదీ సోమవారం జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరగనున్న పోలింగ్ నకు ప్రజలంతా హాజరై తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు ఎస్పీ తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో 10 ఫ్లాగ్ మార్చ్ లను నిర్వహించడం జరిగిందని అన్నారు. జిల్లా పోలీసు సిబ్బందికి సహాయంగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలు జిల్లా కి రావడం జరిగింది అని అన్నారు. మద్యం,నగదు మరియు ఇతర వస్తువుల ద్వారా ఎవరైనా ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ లో అడిషనల్ ఎస్పీ లు వినోద్ కుమార్, భీం రావ్, ఏఎస్పి శివం ఉపాధ్యాయ, డిఎస్పీలు రవీంద్ర కుమార్, రఘు చందర్, ఇన్స్పెక్టర్లు వేణుగోపాల్, ఆరిఫ్ అలీ, రవి, రామ్ నరసింహారెడ్డి ఖాన్, ఆర్.ఐ. లు వేణు, రామకృష్ణ, జానిమియా మరియు ఎస్.ఐ. లు పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు



ఎల్కతుర్తి మే 11 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు జై తెలంగాణ జై కేసీఆర్ బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని, ప్రజలను అభ్యర్థిస్తూ, ఇంటింటి ప్రచారం, నిర్వహించడం జరిగింది. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తంగేడ మహేందర్, సోషల్ మీడియా మండల అధ్యక్షులు గుండేటి సతీష్, గ్రామ శాఖ అధ్యక్షులు మేకల బాబు, రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఇంగే భాస్కర్, మాజీ సర్పంచ్, ఎర్రబెల్లి, సంపత్ రావు, సీనియర్ నాయకులు, కొమురయ్య, సమ్మయ్య, సుధాకర్, శ్రీపతి రావు, బాపూరావు, కమలాకర్ రావు, రమేష్ , ప్రహల్లాద రావు, అంజద్, కృష్ణ సాయి, రవీందర్, వసుదేవ్, రాజ కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వైస్ ఎంపిపి అరేల్లి జోస్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిజెపి నాయకుల ప్రచారం




ఇల్లందకుంట మే 11 (ప్రజామంటలు):
మల్యాల గ్రామంలో బిజెపి పార్లమెంటరీ అభ్యర్థి బండి సంజయ్ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మేజారిటితో గెలిపించాలని గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల వైస్ ఎం పి పి అరేల్లి జోస్న శ్రీనివాస్, ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవినీతిని ప్రశ్నించే ధైర్యం లేనప్పుడు

# చాటుగా నైనా శిక్షించు

**మహమ్మద్ అంకూస్ ప్రముఖ రాజకీయ విశ్లేషకులు**

జమ్మికుంట మే 11 (ప్రజామంటలు):



నేటి సమాజంలో అవినీతిని సూటిగా ప్రశ్నించే ధైర్యం లేనప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ద్వారా చాటుగానైనా అవినీతి రాజకీయ నాయకులను శిక్షించే అధికారం మనకు కల్పించబడింది. కాబట్టి మే 13న జరగనున్న లోక్సభ ఎన్నికల్లో ప్రతి ఒక్క పౌరుడు తన విధిగా భావించి ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు మహమ్మద్ అంకుష్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఓటింగ్ రోజు సెలవు దొరికిందని ఓటు వేయకుండా ఇంట్లో ఉంటే రేపు మనం నాయకులను ప్రశ్నించే అధికారం కోల్పోవడం జరుగుతుంది. ఓటు వేయకపోవడం అంటే లొంగి ఉండడమే అన్నట్టు, ఓటు హక్కు వినియోగించుకోకపోతే మనం సమాజంలో లెక్కలోకి రాకుండా పోతాం. మార్పు అనేది మన నుండే ప్రారంభం కావాలి మార్పు రావాలి అంటే మనం విధిగా ఓటు హక్కు వినియోగించుకొని మనకు మేలు చేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలి. మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు తెలివిగా సిద్ధమైతే తప్ప ప్రజాస్వామ్యం విజయవంతం కాదు. అబ్రహం లింకన్ చెప్పినట్లు బుల్లెట్ కంటే బ్యాలెట్ బలమైనది దీనిని గ్రహించి మన ఓటు హక్కును విధిగా వినియోగించుకొని సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్క పౌరుడు కృషి చేయాల్సినటువంటి బాధ్యత మనపై ఉన్నది. మగవాళ్లు లిక్కర్కు ఆశపడితే, ఆడవాళ్లు కుక్కర్ కు ఆశపడితే చివరికి మనకు నిక్కర్ లేకుండా చేస్తారు జాగ్రత్త. ఓటు వేసే ముందు మన పిల్లల భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది అని గ్రహించాలి అని ప్రజలను కోరారు. చివరగా ఎన్నికల్లో ఓటు వినియోగించుకొని వాడు మరణించిన వాడితో సమానం కాబట్టి ప్రజలారా ఓటు హక్కును విధిగా వినియోగించుకొని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని కోరుచున్నాము.

# పీవీ స్వగ్రామంలో దూసుకెళ్తున్న ‘కారు’ ప్రచారం

**వినోదన్న విక్టరీ ఖాయం : కండె సుధాకర్**



భీమదేవరపల్లి మే 11 (ప్రజామంటలు):
ఎన్నికల ప్రచారంలో చివరి రోజు పీవీ స్వగ్రామం వంగరలో వాడవాడలో, ఇంటింటికి ప్రచారం బి.ఆర్.ఎస్ శ్రేణులు అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ గెలుపు కోసం ముమ్మర ప్రచారం నిర్వహించారు. దేశంలో ఉన్న43 పార్టీలను ఏకం చేసి తెలంగాణ రాష్ట్ర సాధన అంశంలో కీలక పాత్ర పోషించిన వినోదన్న విక్టరీ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంటు అభివృద్ధి చేయాలని లక్ష్యంతో ఉన్న వినోద్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు కండె సుధాకర్, గ్రామ సర్పంచి ఆలూరి రజిత గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ నల్లగోని రాజు, గ్రామ అధ్యక్షులు ఏనుక రాములు, ఎంపిటిసి నల్ల కౌశల్య, వార్డు సభ్యులు గిన్నారపు కుమారస్వామి, దొంత అశోక్, బత్తిని అశోక్, బండి మల్లయ్య, ఆశదపు రాజయ్య, బత్తిని బాలయ్య, వేముల సాధన రమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కువ ఎంపిలు గెలిపిస్తే కెసిఆర్‌దే రాజ్యం

## - పార్లమెంటులో మన గళం వినిపించాలి - హుజూరాబాద్ ప్రచారంలో కెటిఆర్ పిలుపు



**కరీంనగర్,మే11:** తెలంగాణ కోసం కొట్లాడేటోళ్లు పార్లమెంటులో ఉండాలని, మన గళం వినిపించాలంటే బిఆర్ఎస్ ఎంపిలు గెలవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కరీంనగర్ నుంచి బి. వినోద్‌ను గెలిపిస్తే గట్టిగా కొట్లాడుతాడని అన్నారు. అలాగే బిఆర్ఎస్ ఎంపిలు ఎక్కువమంది గెలిస్తే మళ్లీ కెసిఆర్ రాజ్యం వస్తుందని అన్నారు. ఇప్పుడు పదేండ్ల నిజం కేసీఆర్ పాలన, పదేండ్ల విషం బీజేపీ పాలన.. 150 రోజుల అబద్ధం రేవంత్ రెడ్డి పాలన మధ్య పోటీ జరుగుతోందని కేటీఆర్ అన్నారు. గత పదేండ్లలో బీజేపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఐదేండ్లలో బండి సంజయ్ గల్లీలో, ఢిల్లీలో ఎక్కడైనా కనిపించారా అని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ కేంద్ర నిధులు తీసుకొచ్చారా అని నిలదీశారు. ప్రజల తరఫున పార్లమెంటులో గళం విప్పిన నాయకుడు వినోద్ కుమార్ అని చెప్పారు. బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతుగా హుజూరాబాద్‌లో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. అమిత్‌షా చెప్పులు మోయడం తప్ప సంజయ్ ఒక్కపనైనా చేశారా అని ఎద్దేవా చేశారు. కేంద్ర నిధులు రాబట్టే సత్తా వినోద్‌కు ఉందని తెలిపారు.కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ పై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. మత పిచ్చి ఉన్నోడు..ఎంపీగా అవసరమా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల బీజేపీ పాలనలో ఒక్క అభివృద్ధి కూడా జరగలేదన్నారు. పదేళ్ళలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందని మండిపడ్డారు. మే11వ తేదీ శనివారం హుజురాబాద్ లో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు.అయోధ్య గుడి కట్టినం ఓటయ్యాలని బీజేపీ నాయకులు అంటున్నారని.. మరి, కేసీఆర్ కూడా యాదాద్రి గుడి, ఆధునిక గుడులు, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని కేటీఆర్ చెప్పారు. హ్యాండ్లూమ్, పవర్ లూం బోర్డులను రద్దు చేశారని విమర్శించారు. రాశిక్ రెడ్డి కోడిగిత్త లాగా అసెంబ్లీలో రేవంత్ రెడ్డికి చెమటలు పెట్టిస్తున్నాడని.. బండి ఏం పీకాడు.. అమిత్ షా చెప్పులు మోసుడు తప్ప అని దుయ్యబట్టారు. 5ఏళ్లు గాలి తిరుగులు తిరిగినోడు, మతం పేరు మీద మ్యాజిక్‌లు చేసేటోళ్లు ఎంపీగా అవసరమా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో10 నుంచి 12 ఎంపీలను గెలిపిస్తే.. 6 నెలల్లో రాష్ట్ర రాజకీయాలను శాసిస్తామని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ పాలన ఎలా ఉంది.. కాంగ్రెస్ పాలన ఎలా ఉందో ప్రజలు గమనించాలన్నారు. ప్రలోభాలకు ప్రజలు లొంగవద్దని కోరారు. ఆరు గ్యారంటీల హామీ నెరవేర్చారా అని ప్రశ్నించారు. రూ.500 బోనస్ ఇస్తామన్న రేవంత్ హామీ ఏమైందని నిలదీశారు. రూ.2 లక్షల రుణమాఫీ అయ్యిందా.. తులం బంగారం వచ్చిందా అని అడిగారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. కేంద్రంలో ఉన్న సవతి తల్లిపై పోరాటం చేయాలని, అలా పోరాడే వ్యక్తులే పార్లమెంటుకు వెళ్లాలని చెప్పారు. పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే తెలంగాణకు రక్ష అని వినోద్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. మోదీతో కలిసి చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు హైదరాబాద్‌పై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దక్షిణ కాశీ వేములవాడ ఆలయ అభివృద్ధికి మోదీ ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. తెలంగాణ సమస్యలపై కేంద్రంతో మాట్లాడని ఎంపీ బండి సంజయ్ అవసరమా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో వినోద్ కుమార్,హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిలు కూడా పాల్గొన్నారు.

# ప్రమాదంలో వ్యాన్ బోల్తా

## - బయటపడ్డ 7కోట్ల నోట్ల కట్టలు - గుర్తించి స్వాధీనం చేసుకున్న అధికారులు



**విజయవాడ,మే11:** ప్రమాదంలో వ్యాను బోల్తాపడింది.. నోట్ల కట్టలూ బయటపడ్డాయి..! శనివారం హైదరాబాదు నుండి మండపేట కెమికల్ ఫ్యాక్టరీకు వెళుతున్న వ్యానును, నల్లజర్ల మండలం అనంతపల్లి ఎర్ర కాలువ వద్ద వెనుక నుండి లారీ ఢకొట్టడంతో వ్యాన్ తిరగబడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని కెమికల్ బస్తాలన్నీ చెల్లా చెదురుగా పడిపోవడంతో కెమికల్ పొడి బస్తాల మధ్య ఏడు అట్ట పెట్టెలు బయటపడ్డాయి. ప్రమాద ఘటన జరిగిన కొద్ది నిమిషాల్లో స్థానిక సిఐ, దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని బాక్సులను దగ్గరలో ఉన్న టోల్ ప్లాజా పరిపాలన భవనం వద్ద సీసీ కెమెరాల మధ్య అత్యంత కట్టుదిట్టమైన భద్రతలో తెరిచి చూశారు. వాటిలో రూ.500, రూ.200, రూ.100 నోట్ల కట్టలు కనిపించాయి. దీంతో స్థానిక ఎంపీడీవో నరేష్ కుమార్ ఐటి అధికారుల సమక్షంలో లెక్కింపు చేయగా, ఒక్కొక్క బాక్సులో కోటి రూపాయల చొప్పున ఏడు కోట్ల రూపాయల నగదు ఉన్నటళట్లు డి.ఎస్.పి రామారావు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల వేళ భారీగా అక్రమ నగదు బయటపడుతోంది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు కొందరు డబ్బును అక్రమంగా తరలిస్తున్నారు. తాజాగా, ఓ ప్రమాదంలో వాహనం బోల్తా పడగా.. తవుడు బస్తాల మధ్య అట్ట పె÷-టటెల్లో నగదును చూసిన స్థానికులు ఒక్కసారిగా షాకయ్యారు. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లాలో జరిగింది. నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద ఓ లారీ ఢీకొని టాటా ఏస్ వాహనం బోల్తా పడింది. ఆ వాహనంలో తవుడు బస్తాల మధ్యలో 7 బాక్సుల్లో నగదు బయటపడింది. దీన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న నగదు మొత్తం రూ.7 కోట్లు ఉన్నట్లు సమాచారం. ఈ వాహనం విజయవాడ నుంచి విశాఖ వైపు వెళుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ప్రమాదంలో టాటా ఏస్ వాహనం డ్రైవర్ కు గాయాలు కాగా.. అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నగదుపై మరింత సమాచారం ఆరా తీస్తున్నారు.

# అధికారంలోకి రాగానే ఏపికి ప్రత్యేకహోదా

## - పోలవరం,కడప స్టీల్ ఫ్యాక్టరీ పూర్తి చేస్తాం - ప్రత్యేకమోదా కోసం పనిచేయని జగన్, చంద్రబాబు - బిజెపికి ఎ, బి టీమ్‌లుగా పనిచేస్తున్న టిడిపి, వైసిపి
## - కడప నుంచి షర్మిలను పార్లమెంట్‌కు పంపాలి - వైఎస్ పాదయాత్ర స్ఫూర్తితోనే జోడోయాత్ర చేపట్టా - కడప ఎన్నికల ప్రచారంలో రాహుల గాంధీ వెల్లడి



**కడప,మే11:** కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి తాము హామీ ఇచ్చిన విధంగా ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. విభజన హామీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడ ఇపనిచేస్తుందని అన్నారు. కడప బహిరంగ సభలో మాట్లాడిన రాహుల్.. బీజేపీ బీ టీం చంద్రబాబు, పవన్, జగన్ బీజేపీ బీ టీం అని విమర్శించారు. జగన్ ఏనాడు కేంద్రాన్ని ఏ విషయంలోనూ ప్రశ్నించ లేదన్నారు. ఈ పదేళ్లలో ఏపీకి ప్రత్యేక హోదా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. పోలవరం ఎందుకు పూర్తి కాలేదన్నారు. కేంద్రంలోకి అధికారంలోకి రాగానే కడప స్టీల్ ఫ్యాక్టరీ, పోలవరం పూర్తి చేస్తామని చెప్పారు. ప్రతి ఏడాది మహిళలకు లక్ష రూపాయలు ఇస్తామన్నారు. రైతురుణమాఫీ,రైతులకు కనీస మద్దతు , 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు,ఉపాధి కూలీ రూ.400 కు పెంచుతామని హామీ ఇచ్చారు. అంగన్ వాడీల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పారు. సీబీఐ చార్జ్ షీట్ లో వైఎస్సార్ పేరును కాంగ్రెస్ చేర్చలేదన్నారు. హస్తం, వైఎస్సార్ ఒక్కటేనన్నారు. కాంగ్రెస్, వైఎస్సార్ ఆలోచనలకు వ్యతిరేకంగా పనిచేయబోదన్నారు. రాజశేఖర్ యాత్ర స్ఫూర్తితోనే తాను యాత్ర చేశానని చెప్పారు. తన తండ్రికి వైఎస్సార్ మంచి స్నేహితుడు. రాజశేఖర్ రెడ్డిని చూస్తూ పెరిగిన, పాదయాత్రతో పేదల కష్టాలను చూశా. పాదయాత్రలో పేదలకు దగ్గరయ్యా. రాజశేఖర్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శం. ఉమ్మడి ఏపీలో వైఎస్సార్ సేవలు మరువలేమన్నారు. మోదీ రాజ్యాంగాన్నినాశనం చేయాలని చూస్తుందని రాహుల్ విమర్శించారు. పేదలకు హక్కులు లభించేది రాజ్యాంగం వల్లేనని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని మోదీ కాదు ప్రపంచంలో ఎవరూ మార్చలేరన్నారు. షర్మిల పార్లమెంట్ లో ఉండాలి.. షర్మిల నా చెల్లెలు, లోక్ సభకు పంపించాలి. ఏపీ ప్రజల ఆలోచనను ఢిల్లీ పార్లమెంట్ లో వినిపిస్తుంది. షర్మిలను సీబీఐ, ఈడీ ఏం చెయ్యలేదని చెప్పారు.సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏపీసీసీ అధ్యక్షురాలు, ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల శనివారం కడపలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ఆర్ పాదయాత్ర తన భారత్ జోడో యాత్రకు స్ఫూర్తి అని, పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను..నేరుగా తెలుసుకోవచ్చునని వైఎస్ఆర్ తనతో చెప్పేవారని అన్నారు. తన తండ్రి రాజీవ్‌గాంధీ , వైఎస్ఆర్ సోదరుల్లా ఉండేవారని వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ ఏపీకే కాదు.. దేశానికే దారి చూపించారని కొనియాడారు.

# కాంగ్రెస్ కొన్ని తప్పులు చేసింది

## - వాటిని సరిదిద్దుకుంటామన్న రాహుల్ - లక్నోలో చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా చర్చ

**లక్నో,మే11:** కాంగ్రెస్ కొన్ని తప్పులు చేసిందని, వాటిని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. త్వరలోనే కాంగ్రెస్ వైఖరి మారుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయాలకు అనుగుణంగా పార్టీలో మార్పులు చేర్పులు చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. లఖ్నోలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో రాజ్యాంగం గురించీ మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాతలు కోరుకుంటున్న స్థాయిలో ఇది ప్రజలకు ఉపకరించడం లేదని అన్నారు. కుల వ్యవస్థ, రిజర్వేషన్‌ల ప్రస్తావనా తీసుకొచ్చారు. పుట్టక ముందే వాళ్ల భవిష్యత్ ఏంటో నిర్ణయించే ఆలోచనా విధానం పెరిగిపోతోందని, వాళ్లు ఏం చేయగలరో ఏం చేయలేరో ముందే డిసైడ్ చేసేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు రాహుల్ గాంధీ. పదవుల కోసం వెంపర్లాడే నేతలు ఎప్పటికీ రియాల్టీ ఏంటో అర్థం చేసుకోలేరని మండి పడ్డారు రాహుల్ గాంధీ. కనీసం ఎదుటి వాళ్లలో ఎంత సత్తా ఉన్నదీ అర్థం చేసుకోలేరని మండి పడ్డారు. 'కాంగ్రెస్ కొన్ని తప్పులు చేసింది. వాటిని సరిదిద్దుకోవాల్సి ఉంది. మార్పులు చేర్పులు చేయాల్సిన అవసరమూ ఉంది.

# పోలీసులు వెంబడిస్తున్నారన్న భయం

## లేపాక్షిలో నోట్ల కట్టలు వదిలేసిన దుండగులు

### ఈ ఘటనపై అధికారకి సమచారం కోసం విచారణ

**హిందూపురం,మే11:** శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నడిరోడ్డుపైనే పడేశారు. తమను పోలీసులు వెంబడిస్తున్నారనే భయంతో రహదారిపైనే దాదాపు రూ.2 కోట్ల డబ్బును వదిలేసి వెళ్లినట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా పోలీస్ సైరన్ వినిపించడంతో ఇళ్ల ముందు డబ్బు సంచులు పడేసి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ నగదు హిందూపురానికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతసేపటి తర్వాత వచ్చి చూడగా దాదాపు రూ.40 లక్షలు మాయమైనట్లు గుర్తించారు. అయితే, అక్కడి వారిని విచారించి లాభం లేక మిగిలిన డబ్బులతో వారు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారిక సమాచారం లేదు. ఎన్నికల వేళ కొన్ని చోట్ల కొందరు కొత్త పద్ధతుల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. కేవలం నగదు పంపిణీయే కాకుండా.. ఎవరికీ అనుమానం రాకుండా వారికి టోకెన్లు ఇచ్చి తాయిలాలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఒంగోలు నియోజకవర్గంలో ఓటర్లకు రూ.10, మహిళలకు రూ.50 నోట్లు టోకెన్లుగా ఇస్తున్నట్లు సమాచారం. షాపులకు వెళ్లి వీటిని చూపిస్తే రూ.10కు క్వార్టర్ మద్యం బాటిల్, రూ.50కు బియ్య బస్తాలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ సమాచారం అందుకున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టగా.. ఓ గోదాంలో 3 లారీల బియ్య బస్తాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే, ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసిన పోలీసులు, ఎన్నికల అధికారులు సమన్వయంతో సోదాలు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్లు భారీగా అక్రమ నగదు స్వాధీనం చేసుకున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల అధికారులు హెచ్చరిస్తున్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించు కోవాలని సూచిస్తున్నారు.

# ఏదైనా గుర్తింపు కార్డు ఉంటే చాలు

## ఓటేయడానికి అర్హులని తేల్చిన ఇసి

**అమరావతి,మే11:** ఓటరు గుర్తింపు కార్డు ద్వారా ఓటేయడనాకి అవకాశం ఉన్నా..అది లేకున్నా పలు గుర్తింపు కార్డులు చూపి ఓటేయవచ్చని అధికారులు తెలిపారు. ఒకవేళ ఓటరు గుర్తింపు కార్డు లేనివారు ప్రత్యామ్నాయంగా 11 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకదానిని చూపి ఓటు వేయొచ్చు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు ఓటు వేసే అధికారం ఉన్నప్పటికీ, ఆ పేరు గల వ్యక్తిని తానేనని నిరూపించుకోవాల్సి ఉంటుంది. అందుకోసం ఎన్నికల సంఘం ఓటు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఓటరు గుర్తింపు కార్డును అందజేస్తుంది. ఆ గుర్తింపు కార్డుతో ఓటు వేయాలి. ఓటరు గుర్తింపు కార్డు లేనివారు ప్రత్యామ్నాయంగా 11 రకాల గుర్తింపు కార్డులు చూపి ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. 1. పాస్‌పోర్టు 2. డ్రైవింగ్ లైసెన్స్ 3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ఉద్యోగులకు జారీ చేసిన ఫొటోతో కూడిన సర్వీసు గుర్తింపు కార్డులు, 4. బ్యాంకులు జారీ చేసిన పాస్ పుస్తకం, తపాలా కార్యాలయాలు జారీ చేసిన ఫొటో ఉన్న పాస్ పుస్తకాలు, 5. పాన్‌కార్డు, 6. ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, 7. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, 8. కార్మిక మంత్రిత్వశాఖ పథకం కింద జారీ చేసిన ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు, 9. ఫొటోతో కూడిన పింఛను పత్రం, 10. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, 11. ఆధార్‌కార్డు చూపించి ఓటు వేయవచ్చు.

# మైనర్ బాలిక పెళ్లిని అడ్డుకున్న అధికారులు

## ఆగ్రహంతో బాలిక తల నరికి చంపిన వరుడు

**బెంగళూరు,మే11:** నిశ్చితార్థం చేసుకుంటున్న అమ్మాయి మైనర్ బాలిక కావడంతో ప్రభుత్వ అధికారులు నిశ్చితార్థాన్ని అడ్డుకున్నారు. దీనిని జీర్ణించుకోలేకపోయిన వరుడు ఆమెను నరికి చంపాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడుగు జిల్లాలోని సూర్లబ్బి గ్రామానికి చెందిన మీనా (16)తో స్థానికుడైన ప్రకాశ్ (32)కు వివాహం చేయాలని ఇరు కుటుంబాల సభ్యులు నిర్ణయించారు. గురువారం నిశ్చితార్థం జరగాల్సి ఉండగా, బాలికకు ఈ పెళ్లి ఇష్టం లేదు. తనకు పరిచయం ఉన్నవారి ద్వారా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులకు సమాచారం అందించింది. వెంటనే బాలిక ఇంటికి చేరుకున్న అధికారులు నిశ్చితార్థాన్ని అడ్డుకున్నారు. బాల్య వివాహం నేరమని ఆమె తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో ప్రకాశ్ ఆగ్రహంతో ఊగిపోతూ ఆమె ఇంటికి వెళ్లి మీనా తల్లిదండ్రులపై దాడి చేశాడు. ఆపై మీనాను అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి తల నరికి హత్య చేశాడు. మొండాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాలికను హత్యచేసిన ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఓ చెట్టుకు ఉరేసుకుని ప్రకాశ్ కనిపించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో

# రూ. 15 కోట్లకు టోకరా

### రేణిగుంటకు చెందిన వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్,మే11: ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో రూ. 15 కోట్ల మేర కాజేసిన మోసగాడిని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. ఏపీలోని చిత్తూరు రేణిగుంటకు చెందిన ఒబిలి పాపన్నగారి రామచంద్రారెడ్డి మాదాపూర్‌లో ఉంటున్నాడు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెంకటాపురం గ్రామ పరిధిలో 200 ఎకరాల్లో ఓ వెంచర్‌ను ఏర్పాటు చేశామని ప్రచారం చేసుకున్నాడు. అనుమతి లేకుండా లేఔట్‌లు వేసి, ప్రీ లాంచ్ పేరుతో విక్రయాలు ప్రారంభించాడు. ఈ వెంచర్‌కు సమీపంలోనే ఐటీ కారిడార్, రీజనల్ రింగ్ రోడ్ వస్తున్నాయని, ఫలితంగా భూమిరేట్లు పెరుగుతాయని ప్రచారం చేసుకున్నాడు. అంతేకాకుండా తమ సంస్థలో పెట్టుబడి పెట్టిన వారికి నెలనెలా వడ్డీ చెల్లిస్తామని కొంతమంది నుంచి డబ్బులు వసూలు చేశాడు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు తిరిగి అమ్మాలనుకుంటే చదరపు గజానికి రూ.10 వేల చొప్పున చెల్లిస్తానని కూడా నమ్మబలికాడు. ఇతను మరో ప్రాపర్టీస్ ఎండీ వీబీ గుప్తా, ఇతర మార్కెటింగ్ ఏజెంట్లతో కలిసి దాదాపు 50మందిని మోసం చేసి రూ.15 కోట్లు వసూలు చేశాడు. గడిచిన మూడేళ్లుగా వెంచర్‌లో అమ్మకాలు చేసినప్పటికీ ఎవరికీ డబ్బు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు నిందితుడు ఒబిలి పాపన్నగారి రామచంద్రారెడ్డిని అరెస్ట్ చేశారు.

## కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో

# బిఆర్ఎస్‌దే విజయం

### ప్రచారంలో పాల్గొన ఎమ్మెల్యే మర్రి

**హైదరాబాద్,మే11:**కాంగ్రెస్ పార్టీ ఎన్ని డబ్బులు పంచినా, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా కంటోన్మెంట్ ఉప ఎన్నికలో విజయం బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితదేనని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఎన్నికలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత గెలుపుకోసం శనివారం మర్రి రాజశేఖర్‌రెడ్డి కంటోన్మెంట్‌లో నివేదితతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం బోయినపల్లి సౌజన్యకాలనీలోని బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో ఉప ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితతో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు అనితాప్రభాకర్, నళిని కిరణ్, పాండుయాదవ్, భాగ్యశ్రీ శ్యామ్‌కుమార్, లోకనాథం, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరికృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, నర్సింహ ముదిరాజ్, వార్డు బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, మహిళానేతలు, పాల్గొన్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com